Vist us @ www.sooryasena.com
RNI.No.: TELTEL/2023/85598

# సూర్య సేన

మా అక్షరం ప్రజల మార్పు
తెలుగు దిన పత్రిక

Published from: Nalgonda - Hyderabad - Warangal - Khammam - Karimnagar - Mahabubnagar - Vijayawada - Guntur - Kurnool

| సోమవారం MONDAY | 20.10.2025 | నల్గొండ NALGONDA | సంపుటి (Volume): 3 సంచిక (Issue) : 67 | పేజీలు (Pages) : 8 వెల (Rs.) : 2/- | ఎడిటర్: పాల్వాయి జానయ్య Editor: Palvai Janaiah |
|---|---|---|---|---|---|






# మా ప్రభుత్వం రాగానే ధరణి చట్టాన్ని తొలగించి భూభారతి తెచ్చాం : రేవంత్



హైదరాబాద్, అక్టోబర్ 19 (సూర్య సేన) : భూమి మీద ఆధిపత్యం కోసం గతంలో యుద్ధాలు జరిగాయని సిఎం రేవంత్ రెడ్డి తెలిపారు. సర్వేలో తప్పులు చేస్తే ప్రజలు మీ మీద తిరగబడే అవకాశం ఉందని అన్నారు. లైసెన్స్ సర్వేయర్లుగా శిక్షణ పొందిన అభ్యర్థులకు లైసెన్స్ పంపిణీ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా శిల్పకళావేదికలో సిఎం మీడియాతో మాట్లాడుతూ.. కన్నతల్లి పై ఉన్న మమకారాన్నే తెలంగాణ ప్రజలు భూమిపై చూపించారని, గత ప్రభుత్వం తెచ్చిన ధరణి చట్టం.. కొంతమంది దొరలకు చుట్టంగా మారిందని విమర్శించారు. ధరణి చట్టాన్ని అడ్డుపెట్టుకొని భూమి మీద ఆధిపత్యం చెలాయించాలని చూశారని, తమ గెలుపునకు అనేక కారణాలు ఉండొచ్చు..బిఆర్ఎస్ ఓటమికి ధరణి చట్టమే కారణం అని అన్నారు. అధికారంలోకి వస్తే.. ధరణి నుంచి విముక్తి కలిగిస్తామని హామీ ఇచ్చామని, తమ ప్రభుత్వం రాగానే ధరణి చట్టాన్ని తొలగించి భూభారతి తెచ్చామని తెలియజేశారు. గత ప్రభుత్వం నోటిఫికేషన్లు ఇవ్వలేదని..ఇచ్చినా పరీక్షలు పెట్టలేదని, ఒకవేళ పరీక్షలు పెట్టిన ప్రశ్నాపత్రాలు జిరాక్స్ సెంటర్లలో దొరికేవి అని అన్నారు.

గత ప్రభుత్వ హయాంలో టిజిపిఎస్సి పునరావాస కేంద్రంగా ఉండేదని, తమ ప్రభుత్వం రాగానే టిజిపిఎస్సిని ప్రక్షాళన చేశామని రేవంత్ పేర్కొన్నారు. తమ ప్రభుత్వం వచ్చిన ఏడాదిలోనే 60 వేల ఉద్యోగాలు భర్తీ చేశామని, తాము ఉద్యోగాలు ఇస్తుంటే.. కోర్టుల్లో కేసు వేసి ఆపాలని చూశారని మండిపడ్డారు. కోర్టుల్లో పోరాడి అభ్యర్థులకు నియామక పత్రాలు అందజేశామని, త్వరలో గ్రూప్– 3,4 అభ్యర్థులకు నియామక పత్రాలు అందజేస్తామని అన్నారు. దేశ జిడిపిలో తెలంగాణ వాటా ప్రస్తుతం 5 శాతంగా ఉందని, జిడిపిలో తెలంగాణ వాటా త్వరలోనే 10 శాతానికి చేరాలని కోరారు. ఉద్యోగులు కష్టపడితేనే.. ప్రజలు సమస్యలు పరిష్కరిస్తేనే ప్రభుత్వానికి మంచి పేరు వస్తుందని రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు.

# మావోలతో సంబంధాలు తెంచుకోండి...

## నాయకులకు బండి సంజయ్ వార్నింగ్



హైదరాబాద్, అక్టోబర్ 19 (సూర్య సేన) : మావోయిస్టులతో సంబంధాలు ఉన్న వారు, మద్దతు ఇస్తున్న వారు వెంటనే వాటిని ఉపసంహరించుకోవాలని కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ హితవు హెచ్చరించారు. ప్రధాని నరేంద్ర మోడి, కేంద్ర హోం మంత్రి అమిత్ షా మావోయిస్టుల నిర్మూలనతో పాటు అవినీతి, నేర, ఉగ్రవాద సంబంధాల నెట్ వర్క్‌ను వెలికి తీసి బయటపెట్టడానికి చర్యలు చేపట్టిన్నట్లు ఆయన ఆదివారం ట్వీట్ చేశారు. మావోలకు మద్దతునిస్తున్న వారు వెంటనే వాటిని ఉపసంహరించుకోవాలని, లేనిపక్షంలో గుట్టు బయటపడుతుందని ఆయన హెచ్చరించారు. దేశ భద్రతకు ముప్పు కలిగించే వారు ఎవరైనా తప్పించుకోలేరని.. భద్రత విషయంలో కరుణ చూపకుండా కఠిన చర్యలు తీసుకుంటామని సంజయ్ వార్నింగ్ ఇచ్చారు. అంతర్గత భద్రత విషయంలోనూ ముప్పు కలిగించే వారిని క్షమించేది లేదని ఆయన పేర్కొన్నారు. తప్పు చేసే వారి వైపు నిలబడే వారు ఎవరైనా రాజీ లేదని తెలిపారు. రాజకీయ రంగ స్థలంలో ప్రజాస్వామ్యం గురించి గొప్పగా మాట్లాడుతూ మావోలకు మద్దతు ఇస్తున్న నాయకులకు ఇదే తమ హెచ్చరిక అని ఆయన తెలిపారు. మావోలకు మద్దతునిస్తున్న వారు వెంటనే వాటిని ఉపసంహరించుకోవాలని, లేనిపక్షంలో గుట్టు బయటపడుతుందని ఆయన హెచ్చరించారు.

# గోదావరిఖనిలో బుల్లితెర తారల సందడి




అక్టోబర్ 19 (సూర్య సేన) : పెద్దపల్లి జిల్లా గోదావరిఖని పట్టణంలో దీపావళి సందర్భంగా రామగుండం ఏరియా సింగరేణి బొగ్గు పరిశ్రమ యాజమాన్యం పెద్ద ఎత్తున సంబరాలను నిర్వహించింది. ఆదివారం రాత్రి స్థానిక జవహర్లాల్ నెహ్రూ స్టేడియం ఈ వేడుకలకు వేదికైంది. గతంలో ఎన్నడూ లేని విధంగా బుల్లితెర అగ్రతారాలు ఈ సాంస్కృతిక కార్యక్రమాల్లో పాల్గొన్నారు. రామగుండం శాసన సభ్యులు మక్కాన్సింగ్ రాజ్ ఠాకూర్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో బుల్లితెర తారలు పెద్ద ఎత్తున సందడి చేశారు. రాష్ట్ర ఐటీ పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిల్ల శ్రీధర్ బాబు, సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ ముఖ్య అతిథులుగా హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి సంబరాలను ప్రారంభించారు. మంత్రి శ్రీధర్ బాబు మాట్లాడుతూ%% దీపావళి సందర్భంగా వేలాది కార్మిక కుటుంబాలను ఉత్తేజపరిచేందుకు సింగరేణి యాజమాన్యం సంబరాలు చేపట్టడం అభినందనీయం అన్నారు. ఈ కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించినందుకు రామగుండం ఎమ్మెల్యే మక్కాన్సింగ్‌ను ఆయన ప్రత్యేకంగా అభినందించారు.

ఈ కార్యక్రమంలో జాతీయ ఎస్సీ కమిషన్ సభ్యులు వడ్డేపల్లి రామ్ చందర్, ప్రభుత్వ సలహాదారుడు హర్కర వేణుగోపాల్, మినిమం వేజ్ చైర్మన్ జన ప్రసాద్, రామగుండం జీఎం డి లలిత్ కుమార్ తో పాటు సినీ నటుడు, హాస్య హీరో అలీ, నటులు శివారెడ్డి, సాగర్, గీతా మాధురి, జబర్దస్త్ ఫేమ్ బుల్లెట్ భాస్కర్, రచ్చ రవి వంటి ప్రముఖ బుల్లితెర తారలు హాస్యాన్ని, సందడిని పండించారు. రాత్రి 9 గంటల నుండి సాంస్కృతిక కార్యక్రమాలు ప్రేక్షకులలో జోష్ నింపాయి. పారిశ్రామిక ప్రాంతానికి చెందిన వేలాది కార్మిక కుటుంబాలు, ప్రజలు ఈ సాంస్కృతిక కార్యక్రమాలు తిలకించడంతో జవహర్లాల్ నెహ్రూ స్టేడియం కిక్కిరిసిపోయింది. సంబరాల్లో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా పోలీసులు పెద్ద ఎత్తున బందోబస్తు ఏర్పాటు చేశారు.

# నక్సల్స్ రహిత జిల్లాలకు మహర్దశ: కిషన్ రెడ్డి



హైదరాబాద్, అక్టోబర్ 19 (సూర్య సేన) : తమ ప్రభుత్వం చేపట్టిన చర్యలతో పెద్ద ఎత్తున మావోయిస్టులు లొంగిపోతున్నారని కేంద్ర బొగ్గు గనుల శాఖ మంత్రి జి. కిషన్ రెడ్డి తెలిపారు. నక్సల్స్ రహిత జిల్లాలకు మహర్దశ పడుతుందని ఆయన అన్నారు. గత మూడు రోజుల్లోనే మూడు వందల మంది నక్సల్స్ లొంగిపోయారని, అందులో తెలుగు వారు ఎక్కువ మంది ఉన్నారని ఆయన ఆదివారం అంబర్‌పేటలో జరిగిన కార్యక్రమంలో ప్రసంగిస్తూ అన్నారు. పదేళ్ళ క్రితం దేశంలో 125గా ఉన్న నక్సల్స్ ప్రభావిత జిల్లాలు, ఇప్పుడు 11కు తగ్గాయని అన్నారు. అవి కూడా నక్సల్స్ రహిత జిల్లాలుగా మారుతాయని, వాటికీ మహర్దశ పడుతుందన్నారు. వచ్చే ఏడాది మార్చి నెలాఖరు నాటికి దేశంలో నక్సలిజం పూర్తిగా అంతమొందించాలని కేంద్రం పట్టుదలగా ఉందని ఆయన వివరించారు. 'ఆపరేషన్ కగార్'తో సత్ఫలితాలు వస్తున్నాయని, ఇప్పటికే వందలాది మంది నక్సల్స్ లొంగిపోవడానికి ముందుకు వస్తున్నారని ఆయన తెలిపారు. నక్సల్స్ ముందుకు వచ్చి హింసా మార్గాన్ని వదిలి జనజీవన స్రవంతిలో కలిసేందుకు ముందుకు రావడాన్ని స్వాగతిస్తున్నానని అన్నారు. హింస ద్వారా ప్రజాస్వామ్య వ్యవస్థలో ఏమీ సాధించలేరనే సందేశం మరోసారి స్పష్టమైందని ఆయన తెలిపారు. త్వరలోనే దేశంలో నక్సల్స్ రహిత జిల్లాలుగా మాతుతాయని ఆయన చెప్పారు.

# చిరు వ్యాపారులతో మాటా మంతి...




ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆదివారం విజయవాడలోని ప్రముఖ బీసెంట్ రోడ్‌లో పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన సాధారణ ప్రజలు, చిరు వ్యాపారులతో కలిసి మాట్లాడారు. రోడ్డు పక్కన వ్యాపారం చేసుకునేవారు, చిన్న జనరల్ స్టోర్‌లు, చెప్పుల దుకాణాల యజమానులతో ఆయన ముచ్చటించారు. కేంద్ర ప్రభుత్వం వస్తువులపై తగ్గించిన జీఎస్టీ (%+ూ%) కారణంగా ధరలు ఎంతవరకు తగ్గాయి, దాని వల్ల వినియోగదారులకు, వ్యాపారులకు కలిగిన ప్రయోజనాలను అడిగి తెలుసుకున్నారు. ఈ పర్యటనలో ఆయన చింతజపూడి దుర్గారావు అనే వీధి వ్యాపారితో మాట్లాడి, ప్రమిదలు, జనపనార సంచులు అమ్ముతున్న ఆయన సమస్యలను తెలుసుకున్నారు.

# ఆక్రమణల పేరుతో పేదల ఇళ్లు కూలగొడుతున్నారు




అక్టోబర్ 19 (సూర్య సేన) : కాంగ్రెస్ ప్రభుత్వంపై బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్ మరోసారి ఫైరయ్యారు. ఆక్రమణల పేరుతో పేదల ఇళ్లు కూలగొడుతున్నారని మండిపడ్డారు. కాంగ్రెస్ ప్రభుత్వ పరిపాలనలో బుల్డోజర్ రాజ్యం వచ్చిందని.. రాష్ట్రంలో పాలనపరమైన వైఫల్యం కొనసాగుతున్నదని విమర్శించారు. కెసిఆర్ మళ్లీ ముఖ్యమంత్రి కావాల్సిందేనని.. తెలంగాణ మళ్లీ పట్టాలు ఎక్కాల్సిందేనని కెటిఆర్ పేర్కొన్నారు. ఇంతకు ముందు లెక్క ఉండదని.. అందరి లెక్కలు తేలస్తామని వార్నింగ్ ఇచ్చారు. ఇప్పటివరకు ఒక్క పెద్ద వ్యక్తి ఇల్లు అయినా కూలగొట్టారా...? అని నిలదీశారు.

# పారా అథ్లెట్ అర్చనకు కెటిఆర్ అండ



హైదరాబాద్, అక్టోబర్ 19 (సూర్య సేన) : స్థానిక ప్రతిభను ప్రోత్సహించడంలో తమ నిబద్ధతను ప్రదర్శిస్తూ, బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్ పారా–అథ్లెట్ మిట్టపల్లి అర్చనకు అండగా నిలిచారు. రాజన్న సిరిసిల్ల జిల్లా, చంద్రంపేట గ్రామానికి చెందిన అర్చన శుక్రవారం నంది నగర్‌లోని నివాసంలో కెటిఆర్‌ను కలిశారు. కుట్టుపని ద్వారా తన జీవనోపాధిని గడుపుతున్న అర్చన, డిసెంబర్ 8 నుండి 10 వరకు శ్రీలంకలో జరగనున్న అంతర్జాతీయ సౌత్ ఏషియన్ ఛాంపియన్‌షిప్‌లో భారతదేశానికి ప్రాతినిధ్యం వహించేందుకు పారా త్రోబాల్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియాచే ఎంపికయ్యారు. అయితే, ప్రయాణ ఖర్చులు, ఇతర భాగస్వామ్య వ్యయాలను భరించలేక ఆర్థిక ఇబ్బందులను ఎదుర్కొంటున్న అర్చనకు ఈ విజయం అపశ్రుతిగా మారే ప్రమాదం ఏర్పడింది. విషయం తెలుసుకున్న కెటిఆర్ తక్షణమే స్పందించి, అర్చనను వ్యక్తిగతంగా కలిసి మాట్లాడారు. ఆమె ప్రయాణ, క్రీడా ఖర్చులన్నింటికీ పూర్తి ఆర్థిక సహాయం అందిస్తానని హామీ ఇచ్చారు. అంతేకాకుండా, ఛాంపియన్‌షిప్‌కు సిద్ధమయ్యేందుకు అవసరమైన క్రీడా పరికరాలు, శిక్షణా సామగ్రిని కూడా ఆమెకు అందజేశారు. కెటిఆర్ నుంచి సకాలంలో లభించిన ప్రోత్సాహంతో, అంతర్జాతీయ వేదికపై భారత్‌కు ప్రాతినిధ్యం వహించాలనే అర్చన కల సాకారం కానున్నది.

**పాఠకులు, ప్రకటనకర్తలు, ఏజెంట్లు,**
**శ్రేయోభిలాషులకు 'సూర్య సేన' దీపావళి శుభాకాంక్షలు**

**సెలవు :**
దీపావళి సందర్భంగా సోమవారం, మంగళవారం మా కార్యాలయాలకు సెలవు.
కావున 'సూర్య సేన' మంగళవారం (21-10-2025, 22-10-2025) న వెలువడదు. పునర్దర్శనం గురువారం 23- 10- 2025.

– మేనేజింగ్ డైరెక్టర్

# దేశంలో మావోయిస్టు ఉగ్రవాదాన్ని త్వరలోనే అంతం చేస్తాం



న్యూఢిల్లీ, అక్టోబర్ 19 (సూర్య సేన) : భారతదేశం త్వరలోనే మావోయిస్టు ఉగ్రవాదం నుంచి పూర్తి విముక్తి పొందుతుందని, ఇది తన వ్యక్తిగత గ్యారెంటీ అని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ధీమా వ్యక్తం చేశారు. దేశంలో మావోయిస్టుల హింస ముగింపు దశకు చేరుకుందని ఆయన స్పష్టం చేశారు. న్యూఢిల్లీలో జరిగిన ఎన్డీటీవీ వరల్డ్ సమ్మిట్‌లో ప్రధాని మోదీ ప్రసంగిస్తూ ఈ కీలక వ్యాఖ్యలు చేశారు.దశాబ్దాలుగా అభివృద్ధిని అడ్డుకుంటూ, పేద గిరిజనులు, రైతులు, గ్రామస్థుల ప్రాణాలను బలిగొంటున్న మావోయిస్టు హింసపై ప్రధాని తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. ఇటీవల కొందరు బాధితులు ఢిల్లీ వచ్చి, తమ గోడును వినిపించుకోవడానికి ఏడు రోజులు పడిగాపులు కాశారని గుర్తుచేశారు. వారిలో కాళ్లు, చేతులు కోల్పోయిన వారు కూడా ఉన్నారని చెబుతూ భావోద్వేగానికి గురయ్యారు. గత కాంగ్రెస్ ప్రభుత్వాల హయాంలో 'అర్బన్ నక్సల్స్' రాజ్యాంగాన్ని అడ్డుపెట్టుకుని మావోయిస్టుల దారుణాలను కప్పిపుచ్చారని మోదీ ఆరోపించారు.ప్రభుత్వం తీసుకుంటున్న కఠిన చర్యల వల్ల మావోయిస్టుల ప్రాబల్యం గణనీయంగా తగ్గిందని ప్రధాని తెలిపారు. ఒకప్పుడు దేశవ్యాప్తంగా 125 జిల్లాల్లో ఉన్న మావోయిస్టుల ప్రభావం, ఇప్పుడు కేవలం 11 జిల్లాలకే పరిమితమైందని వివరించారు. వాటిలో కూడా అత్యంత తీవ్రంగా ప్రభావితమైనవి కేవలం 3 జిల్లాలు మాత్రమేనని స్పష్టం చేశారు. గడిచిన 72 గంటల్లోనే 303 మంది నక్సలైట్లు లొంగిపోయారని, వీరిలో రూ.1 కోటి వరకు రివార్డు ఉన్న కీలక నేతలు కూడా ఉన్నారని వెల్లడించారు."వీరంతా సాధారణ నక్సలైట్లు కాదు. వారంతా ఇప్పుడు రాజ్యాంగంపై నమ్మకంతో జనజీవన స్రవంతిలో కలిసేందుకు సిద్ధంగా ఉన్నారు" అని మోదీ అన్నారు. తమ ప్రభుత్వం అభివృద్ధి, భద్రతకు పెద్దపీట వేయడం వల్లే ఈ మార్పు సాధ్యమైందన్నారు.

## టీవీకే గుర్తింపు పొందిన రాజకీయ పార్టీ కాదు.....



న్యూఢిల్లీ, అక్టోబర్ 19 (సూర్య సేన) : తమిళనాడు అసెంబ్లీ ఎన్నికలకు ముందు.. దళపతి విజయ్ నేతృత్వంలోని తమిళగ వెట్రి కళగం (టీవీకే) పార్టీకి భారీ షాక్ తగిలింది. టీవీకే పార్టీ గుర్తింపు పొందిన రాజకీయ పార్టీ కాదని.. కేంద్ర ఎన్నికల సంఘం .. మద్రాస్ హైకోర్టుకు వెల్లడించింది. ప్రస్తుతం కరూర్ తొక్కిసలాటకు సంబంధించిన కేసు విచారణ జరుగుతుండగా.. టీవీకే పార్టీ గుర్తింపును రద్దు చేయాలని దాఖలైన ప్రజా ప్రయోజన వ్యాజ్యంపై విచారణ సందర్భంగా మద్రాస్ హైకోర్టుకు కేంద్ర ఎన్నికల సంఘం వెల్లడించింది. కొన్ని రోజుల క్రితం తమిళనాడులోని కరూర్ జిల్లాలో జరిగిన విజయ్ ప్రచార ర్యాలీలో తొక్కిసలాట చోటు చేసుకోగా.. 41 మంది ప్రాణాలు కోల్పోయారు. ఈ ఘటన యావత్ దేశాన్ని తీవ్ర దిగ్భ్రాంతికి గురిచేసింది. ఈ నేపథ్యంలోనే విజయ్ టీవీకే పార్టీ గుర్తింపు రద్దు చేయాలని.. దీంతోపాటు రాజకీయ పార్టీల ప్రచార సభల్లో మహిళలు, చిన్నారులు పాల్గొనకుండా కఠిన ఆంక్షలు విధించాలని.. పలువురు మద్రాస్ హైకోర్టులో పలు ప్రజాప్రయోజన వ్యాజ్యాలు దాఖలు అయ్యాయి. వీటిని మద్రాస్ హైకోర్టు చీఫ్ జస్టిస్ ఎంఎం శ్రీవాస్తవ.. జస్టిస్ జీ అరుల్ మురుగన్‌ల ధర్మాసనం విచారణ జరిపింది. ఇక ఈ కరూర్ తొక్కిసలాట ఘటనకు సంబంధించి సుప్రీంకోర్టులో పెండింగ్‌లో ఉన్న పిటిషన్లు తప్ప..

ఈ కేసులన్నింటినీ విచారణ జరిపేందుకు ఓ ధర్మాసనాన్ని ఏర్పాటు చేసేందుకు వీలుగా వాటన్నింటిని హైకోర్టు పాలనావ్యవహారాల విభాగం ముందు ఉంచాలని హైకోర్టు రిజిస్ట్రీని ఆదేశించింది. ఇక టీవీకే పార్టీ గుర్తింపు రద్దు విషయానికి వస్తే.. ఇప్పటికీ ఆ పార్టీకి హోదా లేనందున ఆ పిటిషన్ నిలబడదని ఎన్నికల సంఘం తరఫు న్యాయవాది నిరంజన్ రాజగోపాల్ వెల్లడించారు.

## మొజాంబిక్‌లో ఘోర ప్రమాదంబోటు బోల్తా పడి ముగ్గురు భారతీయుల మృతి



అక్టోబర్ 19 (సూర్య సేన) : మొజాంబిక్‌లోని బీరా పోర్టు తీరంలో ఘోర ప్రమాదం చోటుచేసుకుంది. భారతీయులతో ప్రయాణిస్తున్న ఒక బోటు బోల్తా పడటంతో ముగ్గురు ప్రాణాలు కోల్పోగా, మరో ఐదుగురు గల్లంతయ్యారు. ఈ దురదృష్టకర సంఘటనను మొజాంబిక్‌లోని భారత హైకమిషన్ అధికారికంగా ధ్రువీకరించింది. సముద్రంలో లంగరు వేసి ఉన్న ఒక ఆయిల్ ట్యాంకర్‌లోకి సిబ్బందిని తరలించేందుకు 14 మంది భారతీయులతో ఒక బోటు బయలుదేరింది. శుక్రవారం బీరా పోర్టు సమీపంలో ఈ సిబ్బంది బదిలీ ప్రక్రియ జరుగుతుండగా, అనుకోని రీతిలో బోటు నీటిలో బోల్తా పడింది. ప్రమాదం జరిగిన వెంటనే స్థానిక అధికారులు సహాయక చర్యలు చేపట్టారు. ఈ ఘటనలో ఆరుగురు భారతీయులను సురక్షితంగా కాపాడగలిగారు. వీరిలో ఒకరు ప్రస్తుతం బీరాలోని ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారని, మిగిలిన ఐదుగురు క్షేమంగా ఉన్నారని భారత హైకమిషన్ వెల్లడించింది. అయితే, ఈ ప్రమాదంలో ముగ్గురు భారతీయులు మరణించినట్లు పేర్కొంది. గల్లంతైన మరో ఐదుగురు సిబ్బంది ఆచూకీ కోసం గాలింపు చర్యలు ముమ్మరంగా కొనసాగుతున్నాయని తెలిపింది. "ఈ దురదృష్టకర ప్రమాదంలో ప్రాణాలు కోల్పోయిన వారి కుటుంబాలకు మా ప్రగాఢ సానుభూతి తెలియజేస్తున్నాం. మృతుల కుటుంబాలతో మేం టచ్‌లో ఉన్నాం. వారికి అవసరమైన అన్ని రకాల సహాయాన్ని అందిస్తున్నాం" అని భారత హైకమిషన్ 'ఎక్స్' (ట్విట్టర్) వేదికగా ఒక ప్రకటనలో పేర్కొంది. గల్లంతైన వారిని గుర్తించేందుకు స్థానిక సముద్రయాన ఏజెన్సీలతో కలిసి పనిచేస్తున్నామని, హైకమిషన్‌కు చెందిన ఒక కాన్సులర్ అధికారి బీరాలో సహాయక చర్యలను పర్యవేక్షిస్తున్నారని అధికారులు తెలిపారు. ప్రమాదానికి గల కచ్చితమైన కారణాలు తెలియాల్సి ఉంది. ఈ ఘటనలో ఆరుగురు భారతీయులను సురక్షితంగా కాపాడగలిగారు. వీరిలో ఒకరు ప్రస్తుతం బీరాలోని ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారని, మిగిలిన ఐదుగురు క్షేమంగా ఉన్నారని భారత హైకమిషన్ వెల్లడించింది. అయితే, ఈ ప్రమాదంలో ముగ్గురు భారతీయులు మరణించినట్లు పేర్కొంది. గల్లంతైన మరో ఐదుగురు సిబ్బంది ఆచూకీ కోసం గాలింపు చర్యలు ముమ్మరంగా కొనసాగుతున్నాయని తెలిపింది.

## మడగాస్కర్ అధ్యక్షుడిగా ఆర్మీ కల్నల్ మైఖేల్ రాండ్రియానిరినా ప్రమాణస్వీకారం



సైనిక తిరుగుబాటుతో అధికారాన్ని చేజిక్కించుకున్న ఆర్మీ కల్నల్ మైఖేల్ రాండ్రియానిరినా మడగాస్కర్ కొత్త ప్రధానిగా ప్రమాణస్వీకారం చేయననున్నారు.

మడగాస్కర్ రాజ్యాంగన్యాయస్థానం శుక్రవారం ఒక వేడుకలో కల్నల్ మైఖేల్ రాండ్రియానిరినా నియామకాన్ని అధికారికంగా ఆమోదించింది. దేశ ఉన్నత రాజ్యాంగన్యాయస్థానంలో ప్రమాణస్వీకారం చేస్తారని రాష్ట్రమీడియా ఒక ప్రకటనలో తెలిపింది. విద్యుత్, నీటి కొరతపై యువత చేపట్టిన నిరసనలు హింసాత్మకంగా మారాయి. ఈ ఘర్షణల్లో 22మంది మరణించగా, సుమారు 100మందికి పైగా గాయపడ్డారని ఐక్యరాజ్యసమితి నివేదించింది. ప్రజా తిరుగుబాటుతో సైన్యం అధికారాన్ని స్వాధీనం చేసుకోవడంతో మాజీ అధ్యక్షుడు ఆండ్రీ రాజోలినా దేశం నుండి పారిపోయిన సంగతి తెలిసిందే. విధులను విడిచిపెట్టడంతో రాజోలీనాను అభిశంసించిన గందరగోళ పరిస్థితుల్లో .. మూడు రోజులకే సైన్యాధికారి అధ్యక్ష పదవి చేపట్టడం గమనార్హం. మూడువారాల యువత ప్రభుత్వ వ్యతిరేక నిరసనల తర్వాత దేశాన్ని సైన్యం స్వాధీనం చేసుకోవడాన్ని ఐక్యరాజ్యసమితి ఖండించింది. మడగాస్కర్‌ను ఆఫ్రికన్ యూనియన్ నుండి సస్పెండ్ చేస్తున్నట్లు ప్రకటించింది. సైనికులతో తన ప్రాణాలకు ప్రమాదం ఉందంటూ దేశాన్ని విడిచిపెట్టిన అధ్యక్షుడు ఆండ్రీ రాజోలినా ప్రస్తుతం ఎక్కడ ఉన్నదీ వివరాలు తెలియదు.


## హిందూ యువతులపై కుట్ర జరుగుతోందన్న ఎమ్మెల్యే గోపీచంద్ పడాల్కర్



ముంబై అక్టోబర్ 19 (సూర్య సేన) : హిందూ అమ్మాయిలు జిమ్‌కు వెళ్లకూడదని మహారాష్ట్ర బీజేపీ ఎమ్మెల్యే గోపీచంద్ పడాల్కర్ చేసిన వ్యాఖ్యలు వివాదాస్పదమయ్యాయి. బీడ్‌లో జరిగిన బహిరంగ సభలో ఆయన ప్రసంగిస్తూ, కళాశాలలకు వెళ్లే హిందూ అమ్మాయిలు జిమ్‌లకు వెళ్లవద్దని, ఇంటి వద్దనే యోగా సాధన చేయాలని సూచించారు.

హిందూ యువతులపై కుట్ర జరుగుతోందని, ఎవరిని విశ్వసించాలో వారికి తెలియని పరిస్థితి నెలకొందని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు.హిందూ అమ్మాయిలపై ఒక పెద్ద కుట్ర జరుగుతోంది. ఈ విషయాలను క్షుణ్ణంగా అర్థం చేసుకోవాలి. ఎవరైనా బాగా మాట్లాడుతున్నారని లేదా మంచి వ్యక్తి అని మోసపోవద్దు. జిమ్‌లలో శిక్షణ ఇచ్చేవారు ఎవరు అనే విషయాన్ని గమనించాలి. మన ఇంట్లోని యువతులు జిమ్‌కు వెళితే వారికి కౌన్సిలింగ్ ఇవ్వాలి. సరైన గుర్తింపు వివరాలు లేకుండా కళాశాలలను సందర్శించే యువతను అడ్డుకోవాలి" అని గోపీచంద్ పడాల్కర్ పేర్కొన్నారు.అయితే, గోపీచంద్ పడాల్కర్ వివాదాస్పద వ్యాఖ్యలు చేయడం ఇదే మొదటిసారి కాదు.

## జపాన్ మాజీ ప్రధాని తోమిచి మురయామా కన్నుమూత





శుక్రవారం జపాన్ మాజీ ప్రధాని తొమిచి మురయామా (101) కన్నుమూశారు. ఈ విషయాన్ని జపాన్ సోషల్ డెమోక్రటిక్ పార్టీ వెల్లడించింది. మురాయామా గత కొన్నిరోజులుగా అనారోగ్య కారణాలతో బాధపడుతున్నారు. ఆయన నైరుతి జపాన్‌లోని తన స్వస్థలమైన ఒయిటాలో ఓ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ కన్నుమూసినట్లు జపాన్ సోషల్ డెమోక్రటిక్ పార్టీ అధిపతి మిజుహొ ఫుకుషిమా ప్రకటనలో తెలిపారు. కాగా, తోమిచి మురయామా జపాన్ సోషల్ డెమోక్రటిక్ పార్టీ అధినేత. ఆయన జూన్ 1994 నుంచి జనవరి 1996 వరకు సంకీర్ణ ప్రభుత్వానికి ప్రధానిగా ఉన్నారు. రెండవ ప్రపంచ యుద్ధాన్ని ముగించిన జపాన్ బేషరతుగా లొంగిపోయి 50 ఏళ్లు పూర్తయిన సందర్భంగా.. 1995 ఆగస్టు 15న తన దేశ దురాక్రమణకు గురైన ఆసియా బాధితులకు క్షమాపణలు చెబుతూ తొమిచి ప్రకటన చేశారు. ఈ ప్రకటన ద్వారా ఆయన ప్రసిద్ధి చెందారు. 2013 వరకు ఉన్న ప్రధానులు తోమిచి సంప్రదాయాన్ని కొనసాగించారు.

## ఖమ్మం పత్తి మార్కెట్లో అధికారుల నిర్లక్ష్యం

**– మార్కెట్ యార్డులో కరెంట్**

**బోర్డులకు ఆనించి పత్తి బస్తాలు వేస్తున్న పట్టించుకోని వైనం**

ఖమ్మం, అక్టోబర్ 19 (సూర్య సేన) : గతంలో మార్కెట్ యార్డుల్లో కరెంట్ షార్ట్ సర్క్యూట్ తో ఎన్నో అగ్నిప్రమాదాలు జరిగినా దాని నుండి గుణపాఠాలు నేర్చుకోని అధికారులు సొంత వ్యాపారాలు,నాయకుల దగ్గర సలాంలు చేయడం తప్ప రైతుల బాగోగుల పట్టించుకోవడం లేదని గగ్గోలు పెడుతున్న రైతులు.మార్కెట్ కు సెలవు దినం కావడంతో యార్డుల్లో నిలువ ఉన్న పత్తి బస్తాలు రైతులవో లేక వ్యాపారస్తులవో అర్థం కాని పరిస్థితి నెలకొనివుంది నిబంధనల ప్రకారం వ్యాపారస్తులు ఏరోజు కొన్న సరుకు ఆరోజే గోదాములకు చేర్చుకోవాలి కానీ నిబంధనలు తుంగలో తొక్కి అధికారులను మేనేజ్ చేసి రైతుల సరుకు వుండాల్సిన యార్డుల్లో వ్యాపారస్తుల నిలువ ఉంచుతున్నట్లు ఆరోపణలు దురదృష్టవశాత్తు అగ్నిప్రమాదాలు చోటుచేసుకుని సరుకు తగలబడిపోతే కాలిపోయిన సరుకు వ్యాపారస్తులదో లేక రైతులుదో తేల్చుకోలేని పరిస్థిత గతంలో అగ్నిప్రమాదాలు జరిగినప్పుడు ప్రభుత్వం రైతు బీమా కింద మంజూరి చేసిన నష్టపరిహారం రైతులకు ఇచ్చారా లేక వ్యాపారస్లకు ఇచ్చినరా అర్థంకావట్లేదు రైతులు మాట్లాడారు.





## ఏకపక్షంగా వ్యవహరిస్తున్న ఇసి

అక్టోబర్ 19 (సూర్య సేన) : బీహార్‌లో భారత ఎన్నికల సంఘం(ఈ.సి.ఐ) ప్రారంభించిన ప్రత్యేక సమగ్ర పరిశీలన (సర్)ను సందర్భాన్ని బట్టి చూస్తే విపత్కర ప్రభావాలు చూపబోతుందని చెప్పడం దిగ్భ్రాంతి కలిగించవచ్చు.అయితే ఇప్పుడు ఆ ప్రభావాలేమిటో బహిర్గతమవుతున్న పరిస్థితి. జూన్25న ఈ ప్రక్రియను ప్రారంభించి కొద్దిరోజుల్లోనే దాని అసలు లక్ష్యం ఓటర్ల జాబితాల ప్రక్షాళనను మించి ఇంకా చాలా వుండబోతోందని స్పష్టమైంది. ఆ కసరత్తులో మూడు ప్రత్యేక లక్షణాలు కొట్టొచ్చినట్టు కనిపించాయి. మొదటిది ఈ ప్రక్రియలో అతను లేక ఆమె ఓటర్ల జాబితాలో తన పేరు వుంచాలంటే పౌరులు నిరూపణకు తమ ఆధారాలను తామే సమకూర్చుకునే బాధ్యత తీసుకోవాలి. గతంలోనైతే ఓటర్ల జాబితాల పున:పరిశీలన బాధ్యత ఇ.సి.ఐ నియమించిన ఎన్యూ మరేటర్లు నిర్వహించేవారు. కానీ ప్రస్తుత సందర్భంలోనైతే ఇప్పుడున్న లేక కాబోతున్న ఓటర్లు ఒక ఫారం సమర్పించడమే గాక ఇ.సి.ఐ నిర్దేశించిన పదకొండు పత్రాల్లో ఏదో ఒకటి చూపిం చాల్సి వుంటుంది. అధికార పత్రాల అందుబాటు స్థాయి చాలా తక్కువలోనే వుండే నేపథ్యంలో ఈ ప్రక్రియ పున:పరిశీలనకు గాక తొలగింపునకూ, తీసివేతకూ ఉద్దేశించబడిందని తేలిపోయింది. రాజ్యాంగం, తర్వాత వరుసగా అనేక సుప్రీంకోర్టు తీర్పులు గుర్తించిన సార్వత్రిక ఓటు హక్కు అనే సూత్రానికి తిలోదకాలు ఇస్తున్నట్టు అర్థమైంది. రండవ ప్రశ్న ఈ.సి.ఐ ఓటరు పౌరసత్వాన్ని నిర్ధారించే హక్కు బలవంతాన లాక్కుంటున్నదా? రాజ్యాంగం 326వ అధికరణం ప్రకారం ఓటరు హక్కుకు సంబంధించి పౌరసత్వంపై యథాలాపంగా చేసిన ప్రస్తావన ఆధారంగా ఈ వాదన తీసుకురాబడింది. పౌరసత్వం వుండాలనే ముందస్తు షరతుకు మినహాయింపు లేదు గానీ దాన్ని నిర్ధారించే బాధ్యత మాత్రం ఈ.సి.ఐది కాదు. ఈ విషయంలో హోం మంత్రిత్వ శాఖకు బాధ్యత అప్పగించబడింది. ఏమైనా 'సర్' తతంగం ఈ అవసరాన్ని తేలిగ్గా ఏకపక్షంగా తోసిపారేసింది. ఇక చివరగా కాలవ్యవధి. పెద్ద సంఖ్యలో వలస కార్మికులు జీవనోపాధి కోసం రాష్ట్రం వదలివెళ్లే బీహార్ వంటి రాష్ట్రంలో ఇచ్చిన ఈ కాలవ్యవధి చాలా స్వల్పం. అనేక ప్రాంతాల్లో వరద పరిస్థితుల వంటివి వుండగా వర్షా కాలంలో ఈ కసరత్తుకు అతి స్వల్ప వ్యవధి మాత్రమే లభించింది. బూత్‌స్థాయి అధి కారులు (బి.ఎల్.ఓ)లకు శిక్షణ లేని పరిస్థి తులలో ఇంత నిశితమైన ప్రక్రియ పూర్తి కావడం నిజంగానే అసంభవం. కనుకనే ఈ విషయంలో వచ్చిన తుది ఫలితం ఏమాత్రం ఆశ్చర్యం కలిగించేదిగా లేదు. 81 లక్షల మందికి పైగా ఓటర్లు తుది జాబితాలో పేరు పొందలేకపోయారు. 1.38 కోట్ల మంది ఓటర్ల చిరు నామాలు అనుమానాస్పదంగా వున్నాయన్నారు. తొమ్మిది లక్షల మందికి పైగా మహిళా ఓటర్లు తమ ఓటుహక్కు కోల్పోయారు. 14 లక్షల మందికి పైగా ఓటర్లకు ఒకటికి మించిన ఎపిక్ కార్డులున్నట్టు తేలింది. 100 మందికి పైగా ఓటర్లు వున్న ఆవాసాలు 2258 వున్నాయి. కనుక ఇది పారదర్శకంగా జరిగిందనడానికి ఎలాంటి ఆధారం లేదు. ఫిర్యాదులు లేని స్వచ్ఛమైన జాబితా ఎంతమాత్రం కాదు ఇది, తుది ఓటర్ల జాబితాలు తీవ్ర సందేహాలకు నిలయంగా మారాయి. బీహార్ శాసనసభ ఎన్నికల్లో బీజేపీకి మేలు చేసేందుకే ఈ తతంగం ఉద్దేశించబడిందని మొదటి నుంచి స్పష్టమవుతూనే వుంది. ఎందు కంటే గతంలో ఈ ఎన్నికలు హోరాహోరీ పోటా పోటీగా జరిగాయి. ఈసిఐ తలపెట్టిన 'సర్'ను బలపర్చేందుకు రంగంలోకి దిగింది బీజేపీ మాత్రమే. సహజం గానే ప్రతిపక్షాలు, ఆందోళన చెందిన పౌరులు గట్టిగా ఎదిరించేందుకు ముందు కొచ్చారు. దీన్ని చక్క దిద్దేందుకు రాజ్యాంగం ఇచ్చిన ప్రతి వేదికనూ వాడుకోవడానికి ప్రయత్నించారు. రాజకీయ పార్టీలూ పౌర సంఘాలు దాఖలు చేసిన ఎన్నికల పిటిషన్లు ఇప్పటికీ సుప్రీంకోర్టు విచారణ లోనే వున్నాయి. అత్యున్నత న్యాయస్థానం ఈ.సి.ఐ ఆధార్ కార్డు అనే 12వ పత్రాన్ని కూడా పరిగణనలోకి తీసుకోవాలని పరిమిత మధ్యంతర ఉత్తర్వు ఇచ్చినప్పటికీ విస్తారమైన సమస్యలు మిగిలే వున్నాయి. ఓటర్ల సంఖ్య భారీ ఎత్తున తగ్గిపోయింది.

ఈ.సి.ఐ ప్రయత్నమంతా మోసపూరితంగా వుందనేది ఇప్పుడు కండ్లకు కట్టినట్టు కనిపిస్తుంది. 2025 బీహార్ ఎన్నికలలో 'సర్' ప్రక్రియ చేపట్టడం అంటే.. 2003లో జరిగిందే మరోసారి జరుగుతున్నది తప్ప ఎంతమాత్రం అసాధారణం కాదని, ఈ.సి.ఐ ముందు నుంచీ వాదిస్తూ వచ్చింది. అయితే అప్పటి మార్గదర్శకాలను వెల్లడించాలని కోరగా ఎన్నికల సంఘం అందించలేదు. ఇందుకు సంబంధించి నాటి అధికార పత్రాలు అందుబాటులో లేవన్నది అపరిపక్వతను బయట పెట్టుకోవడమే గాక వ్యవస్థా గతమైన అసమర్థతను కూడా వెల్లడించుకుంది. అయితే వారు పచ్చి అబద్ధాలకు పాల్పడ్డారనేది ఇప్పుడు తేటతెల్లమైపోయింది. ప్రజాస్వామ్య సంస్కరణల వేదిక (ఎ.డి.ఆర్) సుప్రీం కోర్టుకు నాటి ఈ పత్రాలను సమర్పించడాన్ని బట్టి ఇది అబద్ధమని తేలింది. 2003 ఆదే శాలు వేల పేజీలున్నాయి. ఈ కసరత్తు చేపట్టే తరుణంలో మూడు కోణాలలోనూ ఈ.సి.ఐ ఎలాంటి మోసానికి పాల్పడిందో ఇప్పుడు సంపూర్ణంగా తెలిసిపోయింది. ఇంకా ఏమైనా గజిబిజి అంటూ వుండి వుంటే నరేంద్ర మోడీ దళపతి అయిన హోంమంత్రి అమిత్ షా దాన్నీ లేకుండా చేశారు. పౌరులు కాని వారిని గుర్తించి తొలగించి పంపించేయ డానికే 'సర్' ద్వారా ప్రయత్నం జరిగిం దని ఆయన చెప్పేశారు. ఈ వాదనను సమర్థిం చుకోవడం కోసం ఆయన దేశ ముస్లిం జనాభాలో సాపేక్షంగా వచ్చిన స్వల్ప పెరుగుదలను నొక్కి చెప్పారు. ఈ పెరుగుదలకు కారణం సంతానోత్పత్తి రేటు పెరగడం గాక పెద్ద ఎత్తున జరిగిన చొరబాట్లేనని ఆయన మరీమరీ చెప్పారు. దేశంలో ముస్లిం జనాభా 24.6 శాతం చొప్పున పెరిగితే హిందూ జనాభా 4.5 శాతం చొప్పున తగ్గిపోతూ వస్తోందని ఆయన లెక్కలు చెప్పారు. ఈ వాదన ఆధారం గానే ఆయన పార్టీ ప్రభుత్వం చొర బాటుదార్లను గుర్తిస్తానంటున్నది. ఓటర్ల జాబితా నుంచి వారి పేర్లు తొలగించడానికి చేయవలసింది మొత్తం చేస్తుంది. ఉత్తరోత్తరా వారిని స్వదేశాలకు పంపించేస్తుంది అన్నారు. 'సర్' నేపథ్యమేమిటో ఆయన స్పష్టంగానే ఏకరువు పెట్టారు. అయితే పహల్గాంలో ఉగ్రవాదులను పట్టుకోవడంలో విఫలమైనట్టే ఆయన మంత్రివర్గం చొరబాటుదారులను స్పష్టంగా ఎత్తిచూపడంలోనూ ఘోరంగా విఫలమైంది. ఆ విధంగా విఫలమైన కారణంగా ఆయన ఇప్పుడు ఇసిఐ భుజాల మీద తుపాకి పెట్టి కాల్చాలని ప్రయత్నిస్తున్నారు.

భారీ సంఖ్యలో న్యాయమైన భారతీయ ఓటర్ల పేర్లు తొలగించబడినా సరే 'సర్'ను ఎవరూ ఏ మాత్రం వ్యతిరేకించరాదని ఆయన చాలా మొండిగా కరుగ్గా చెబుతున్నారు. భారత దేశంలో జనాభా తీరుతెన్నుల గురించి 'ప్యూ' అధ్యయన కేంద్రం వెలువరించిన నివేదిక మతాల వారీ జనాభా వివరాలను పొందుపర్చింది. భారత దేశంలో మొత్తంగా జననాల రేటు తగ్గడమే కాదు. 2015లో ఈ తగ్గుదల దాదాపు అభివృద్ధి చెందిన సంపన్న దేశాలతో సమానంగా వుంది. ఇక భారతీయ ముస్లింలలోనూ జననాల రేటు ఒక మహిళకు 4.4 వుంటే ఇప్పుడు 2.6కు తగ్గి పోయింది.

# అలనాటి మిత్రుల ఆత్మీయ కలయిక....



హుజూర్నగర్ ప్రతినిధి, అక్టోబర్ 19 (సూర్య సేన) : లింగగిరి గ్రామంలోని ఫార్ బాయిల్డ్ రైస్ మిల్ వద్ద పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 1987 –88 విద్యా సంవత్సరం 10వ తరగతి పూర్తి చేసిన విద్యార్థులు ఆదివారం నిర్వహించిన ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా క్రికెట్ క్రీడను, సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించుకున్నారు. అలనాటి జ్ఞాపకాలను గుర్తు చేయించుకుని ఆడి, పాడి ఆనంద ఉత్సాలతో జరుపుకున్నారు. అనంతరం విజేతలకు బహుమతులు అందజేశారు. పెండ్యాల నాగరాజు, కుక్కడపు కోటేశ్వరరావు, రవీందర్, విజయ శంకర్, రామనరసింహారావు, జానీ పాషా, చందాల శ్రీను, వెంకట్రావు, సులువ యాదగిరి, మిట్టపల్లి శ్రీను, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.


# జిల్లా ప్రజలకు పోలీస్ శాఖ తరపున దీపావళి శుభాకాంక్షలు

– బాణసంచా పేల్చి సమయంలో జాగ్రత్తలు పాటించాలి
– అనుమతులు లేకుండా ఎక్కడపడితే అక్కడ క్రాకర్స్ అమ్మవద్దు
– జిల్లా ఎస్పి నరసింహ ఐపిఎస్



సూర్యాపేట క్రైమ్, అక్టోబర్ 19 (సూర్య సేన) : దీపావళి పండుగ పురస్కరించుకొని జిల్లా ప్రజలందరికీ పోలీస్ శాఖ తరపున పండగ శుభాకాంక్షలు తెలువుతున్నాను సూర్యాపేట జిల్లా ఎస్పీ నరసింహ ఐపిఎస్ అన్నారు. ప్రజలు సంతోషంగా ఉత్సవాలు జరుపుకోవాలని సంప్రదాయ పండుగలు అందరూ కలిసిమెలిసి నిర్వహించుకోవాలని కోరారు. ఉత్సవాల పేరుతో ఇతరులను ఇబ్బందులకు గురి చేయొద్దని, మహిళలను గౌరవించాలని తెలిపారు. అధికారుల అనుమతి లేకుండా ఎక్కడపడితే అక్కడ బాణాసంచా విక్రయాలు చేయవద్దని కోరారు. ప్రజల భద్రతను దృష్టిలో ఉంచుకుని ప్రమాదకర సంఘటనలను నివారించడంలో భాగంగా ఈ చర్యలు తీసుకుంటున్నామని ఎస్పీ పేర్కొన్నారు. బాణాసంచా తయారీదారులు, సరఫరాదారులు, విక్రయదారులపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసినట్లు ఎస్పీ తెలిపారు. జిల్లా ప్రజలందరూ కలిసిమెలిసి ప్రమాదాలకు దూరంగా ఉంటూ ఉత్సవాలు సురక్షితంగా, శాంతియుతంగా జరుపుకోవాలని జిల్లా ఎస్పీ కోరారు.

# బీసీలకు ద్రోహం చేస్తున్న బిజెపి మంత్రులు, రాజ్యసభ సభ్యులు నైతిక బాధ్యత వహించి రాజీనామా చేయాలి



– బీసీ బంద్ కు సహకరించిన సకల జనులకు ధన్యవాదాలు
– బీసీ హక్కుల సాధన సమితి ధనుంజయ నాయుడు

హుజూర్నగర్ ప్రతినిధి, అక్టోబర్ 19 (సూర్య సేన) : బీసీ బిల్లును షెడ్యూలు తొమ్మిదిలో చేర్చకుండా బీసీలకు ద్రోహం చేసిన బిజెపి పార్టీకి చెందిన రాష్ట్ర మంత్రులు రాజ్యసభ సభ్యులు తక్షణమే నైతిక బాధ్యత వహించి తక్షణమే రాజీనామా చేయాలని బీసీ హక్కుల సాధన సమితి తెలంగాణ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ధూళిపాలళ ధనుంజయ నాయుడు డిమాండ్ చేశారు. ఆదివారం ఆయన సూర్యాపేట జిల్లా నేరేడుచర్లలో బిసి హక్కుల సాధన సమితి కార్యాలయంలో బీసీ ముఖ్య తో కలిసి పాత్రికేయులతో మాట్లాడుతూ. ఈనెల 18 జరిగిన బీసీ బందులో బిజెపి పార్టీ పాల్గొనడం హాస్యాస్పదంగా ఉన్నదని నిజానికి బీసీలకు ద్రోహం చేసిన వాళ్లే బీసీ బందుకు మద్దతు ఇవ్వడం ఒకింత ఆశ్చర్యానికి గురి చేసిందని దొంగే...దొంగ దొంగ అన్నట్టుగా ఉందే తప్ప బిజెపి వారి చర్య ఎవరు సమర్థించరు అని ఆయన వ్యాఖ్యానించారు.

ఇప్పటికైనా బిజెపి షెడ్యూల్ తొమ్మిదిలో బీసీ బిల్లులు చేర్చాలని అంతకంటే గత్యంతరం లేదని తెలంగాణ వ్యాప్తంగా అస్తిత్వ ఉద్యమాలు ఊపొందుకున్నాయని ఇవాళ్ళ బీసీలకు ప్రధాన శత్రువు బీజేపీ బిఆర్ఎస్ అని వారికి రానున్న సార్వత్రిక ఎన్నికల్లోను త్వరలో జరగబోయే జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లోను బీసీలు తగు రీతిలో బుద్ధి చెపుతారని బిజెపి మరియు బిఆర్ఎస్ పార్టీలు అగ్రవర్ణాల వారికి జూబ్లీహిల్స్ లో ఎమ్మెల్యే టికెట్ ఇచ్చారని ఒక్క కాంగ్రెస్ పార్టీ మాత్రమే బీసీలకు టికెట్ ఇచ్చిందని బీసీ అభ్యర్థి గెలిపించవలసిన బాధ్యత ప్రతి బీసీ పైన ఉన్నది అని ఆయన అన్నారు ఈనెల 18 తేదిన తెలంగాణ బిసి బందులో పాల్గొన్న యావన్మంది ప్రజానీకానికి వ్యాపార వర్గాలకు ఉద్యోగ వర్గానికి ప్రత్యేక ధన్యవాదాలు ఆయన వెంట బీసీ హక్కుల సాధన సమితి జిల్లా గౌరవాధ్యక్షుడు చిలకరాజు శ్రీను, సంఘం జిల్లా సహాయ కార్యదర్శి కోమట్రాజు వెంకట్, దీకొండ మనోజ్ పాల్గొన్నారు.

# తెలంగాణ రాష్ట్ర సమాచార హక్కు చట్టం కమిషనర్ పీ. వీ శ్రీనివాసరావు




ఖమ్మం, అక్టోబర్ 19 (సూర్య సేన) : జిల్లా కేంద్రంలో జిల్లా పరిషత్ మీటింగ్ హాల్ లో తెలంగాణ మాదిగ హక్కుల దండోరా ( టీఎంహెచ్డీ ) రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ కొరిపల్లి శ్రీనివాస్ మాదిగ అధ్యక్షతన ఏర్పాటుచేసిన సమాచార హక్కు చట్టం అవగాహన సదస్సుకు ముఖ్య అతిథిగా విచ్చేసిన సమాచార హక్కు చట్టం కమిషనర్ పీవి శ్రీనివాసరావు ముందుగా అంబేద్కర్ సెంటర్లో ఉన్న , అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పించి , అవగాహన సదస్సు హజర్కె ఆయన మాట్లాడారు . 2005లో ఏర్పాటు చేసిన సమాచార హక్కు చట్టం ప్రతి పౌరుడి చేతిలోని వజ్రాయుధం అని , ప్రతీ పౌరుడు సమాచార హక్కు చట్టంపై అవగాహనతో ఉపయోగించుకోవాలని కోరారు , సమాచార హక్కు చట్టం పై అన్ని శాఖలలో అవగాహన కల్పిస్తూ , భారత రాజ్యాంగంలో పొందుపరచబడిన పౌరుల హక్కులను ఉపయోగించుకోవాలని కోరారు . అదేవిధంగా సమాచారం కోసం , సమాచార హక్కు చట్టం 2005 సెక్షన్ 6(1) ప్రకారం దరఖాస్తు చేసుకున్న ప్రతి పౌరుడికి , పౌర సమాచార అధికారి నిర్ణీత గడువులోగ , సమాచారాన్ని అందజేయాలని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఎల్ హెచ్ పియస్ రాష్ట్ర నాయకులు బానోత్ భద్రు నాయక్ , బీసి జెఏసీ జిల్లా నాయకులు పెరుగు వెంకటరమణ యాదవ్ , మహాత్మా జ్యోతిరావు పూలే సంఘం వ్యవస్థాపక అధ్యక్షులు పెళ్ళూరూ విజయ్ కుమార్ , మాల మహానాడు జిల్లా అధ్యక్షుడు దాసరి శ్రీనివాస్ , అంబేద్కర్ ప్రజాసేవ సంఘం జాతీయ నాయకులు లింగాల రవికుమార్ , దక్కలి హక్కుల పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షులు డేవిడ్ రాజ్ , బహుజన ఉద్యమకారుడు గర్జన , ఎంఎంఎస్ రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు బెల్లంకొండ శ్యామల మరియు తెలంగాణ మాదిగ హక్కుల దండోర రాష్ట్ర , జిల్లా , నియోజకవర్గ నాయకులు మరియు సమాచార హక్కు చట్ట సమన్వయ కర్తలు పాల్గొన్నడం జరిగింది . ఈ కార్యక్రమంలో అంబేద్కర్ ప్రజాసేవ సంఘం జాతీయ అధ్యక్షులు లింగాల రవి కుమార్ ఎల్ హెచ్ పి ఎస్ రాష్ట్ర అధ్యక్షులు బానోత్ బద్రి నాయక్ , బీసీ జేఏసీ నాయకులు పెరుగు వెంకటరమణా యాదవ్ , మహాత్మ జ్యోతిరావు పూలే వ్యవస్థాపకులు పెళ్లూరు విజయకుమార్ , డిఎంహెచ్డీ రాష్ట్ర అధికార ప్రతినిధి మేళ్లచెరువు కృష్ణ బాబు , టిఎంఆర్పిఎస్ జాతీయ ఉపాధ్యక్షులు లంక వెంకటేశ్వర్లు , బహుజన ఉద్యమకారుడు గర్జన ఎంఎంఎస్ రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు బెల్లంకొండ శ్యామల మాదిగ సామాజిక ఉద్యమకారుడు కిన్నెర ప్రవీణ్ టీఎంహెచ్డీ జిల్లా ఉపాధ్యక్షులు పడిశాల వెంకన్న టీఎంహెచ్డీ జిల్లా అధ్యక్షులు దుప్పిల్లి శ్రీను టీఎంహెచ్డీ జిల్లా ఉపాధ్యక్షులు కనక పూడి వీరస్వామి మధిర నియోజకవర్గ బాధ్యులు బొడ్డు వెంకయ్య బాబు పాలేరు నియోజకవర్గ బాధ్యులు కొర్ని వెంకటనారాయణ ఇల్లందు నియోజకవర్గ బాధ్యులు మునగలేటి వీరస్వామి సత్తుపల్లి నియోజకవర్గ ఇన్చార్జి ఆదూరి బాలకృష్ణ కొత్తగూడెం నియోజకవర్గ ఇన్చార్జి , దుప్పటి బాబురావు హెచ్డి జిల్లా నాయకులు మంద కుమార్ విద్యార్థి విభాగం జిల్లా అధ్యక్షులు కొండపల్లి మధు మాదిగ తంబర్ల వెంకట కర్ణ అంబేద్కర్ నాగరాజు కిన్నెర శ్రీను మెట్టు నవీన్ కుమార్ ఆదూరి రామారావు ఆదూరి కృష్ణ ఆదూరి రాజ్ కుమార్ ఆదూరి మైనర్ బాబు ఆదూరి నాగార్జున ఆదూరి మధు ఆదూరి బాలకృష్ణ ఆదూరి రాము జొన్న గట్ల వంశీ ఆదూరి ధోని ఆదూరి నాగరాజు ఆదూరి అంజిబాబు వెంకన్న కనక రత్నం ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు పాల్గొన్నారు. ఈ కార్యక్రమం లో రైటర్ సింగర్ ఫక్రుద్దీన్ సింగర్ కొమ్ముర‌మ్మ సింగర్ పెద్దపాక విజయ్ రవి తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

– 20 సంవత్సరాల తర్వాత అపూర్వ కలయిక



కూసుమంచి, అక్టోబర్ 19 (సూర్య సేన) : మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 2000 నుండి 2005 వ సంవత్సరం లో 10 వ తరగతి వరకు చదువుకున్న విద్యార్థులు స్థానిక పాఠశాలలో ఆదివారం ఆత్మీయ సమ్మేళన కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. తొలుత వారితో పాటు చదువుకొని మృతి చెందిన విద్యార్థులకు, ఉపాధ్యాయులకు సంతాప సూచకంగా రెండు నిమిషాల పాటు మౌనం పాటించి నివాళులర్పించారు. అనంతరం విద్యార్థులు గత జ్ఞాపకాలను నెమరు వేసుకున్నారు. 20 సంవత్సరాల తర్వాత కలవడంతో చిన్ననాటి జ్ఞాపకాలను వేసుకున్నారు. వివిధ రంగాలు, ఉద్యోగాలు, వ్యాపారాలు, ఇతర రంగాల్లో స్థిరపడిన అలనాటి విద్యార్థులు ఒకచోట చేరి పాత జ్ఞాపకాలను నెమరు వేసుకొని ఆనందంలో మునిగిపోయారు. ఈ సందర్భంగా ఒకరినొకరు ఆప్యాయంగా పలకరించుకొని ఆటపాటలతో, సాంస్కృతిక కార్యక్రమాలతో ఆనందంగా గడిపారు. అనంతరం తమకు విద్య నేర్పిన గురువులకు శాలువాలతో సన్మానించి మెమెంటో అందజేసి ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా విద్యార్థులు తాజా పరిస్థితులను, కుటుంబ వివరాలను సభా వేదికగా పంచుకున్నారు. అనంతరం విద్యార్థులను క్లాస్ రూమ్ లో కూర్చోబెట్టి ఉపాధ్యాయులు పాఠాలు చెప్పి గత జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. అనంతరం విద్యార్థులు ఉపాధ్యాయులు సహం పక్తి బోజనాలు చేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు రామానుజాచార్యులు, ఆశ, సత్తార్ బేగం, రవి, సురేందర్ రెడ్డి, నరసింహారావు, స్కూల్ అటెండర్ రమేష్, విద్యార్థులు బానోతు కృష్ణ, దామల రాజు, అర్వపల్లి నరేష్, నాగేశ్వరరావు, పడిశాల వినయ్, దామల్ల నరేష్, సతీష్, స్వామి, పిడియాల రామ్, లక్ష్మణ్ స్వరూప, సునీత, రజిని, రేణుకా, స్రవంతి, ధనలక్ష్మి, ఉమ, భవాని, అనూష, శారద, కీర్తి, ప్రత్యూష, స్వరూప తదితరులు పాల్గొన్నారు.

# నాయి బ్రాహ్మణ సేవా సంఘం ఆధ్వర్యంలో ధన్వంతరి జయంతి




కోదాడ ప్రతినిధి, అక్టోబర్ 19 (సూర్యసేన) : ధన్వంతరి జయంతిని పురస్కరించుకొని కోదాడ నాయి బ్రాహ్మణ సేవా సంఘం ఆధ్వర్యంలో ఆదివారం సంఘ భవనం నందు ధన్వంతరి చిత్రపటానికి పూలమాలలు వేసి సాంప్రదాయంగా భక్తి శ్రద్ధలతో పూజలు నిర్వహించారు. నాయి బ్రాహ్మణ సంఘం కోదాడ అధ్యక్షులు ఆలేటి గోపి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో నాయి బ్రాహ్మణ సంఘం పెద్దలు పాల్గొని మాట్లాడుతూ సంపూర్ణమైన ఆరోగ్యాన్ని అందించే ఆయుర్వేద వైద్యానికి ఆద్యుడు భగవాన్ ధన్వంతరి అని ఆయన సమాజానికి అందించిన ఔషధ సేవలను స్మరించారు. ఆయన ఆశయలను ఆదర్శంగా తీసుకొని ప్రతి ఒక్కరు ఆయన చూపిన బాటలో నడవాలి అన్నారు. ఈ కార్యక్రమంలో కోదాడ పట్టణ నాయి బ్రాహ్మణ సేవా సంఘం అధ్యక్షులు ఆలేటి గోపి,నాయి

బ్రాహ్మణ ప్రముఖులు సురభి నరసయ్య, ఆలేటి పెద్ద సత్యనారాయణ, పాలూరు సత్యనారాయణ, ఆలేటి చిన్న సత్యనారాయణ, గుడిమల్ల శ్రీహరి, ఆలేటి వెంకటేశ్వర్లు, వినకొల్లు శ్రీనివాస్,పిన్నెల్లి మురళి, మునగపాటి శ్రీను, తూముల రాంబాబు, తాడేపల్లి శ్రీనివాస్, ఆలేటి సహదేవ్, మార్కాపురం శంకర్, ఆలేటి సాయి కృష్ణ, తాడేపల్లి రాము, తాడేపల్లి అజయ్, సతీష్. అంజి, తూముల శివప్రసాద్, గురుస్వామి సంఘ సభ్యులు పాల్గొన్నారు.

# శీర్షిక కవిత ‘ పొగలో జ్యోతి ఆర్తి’

దీపాల వెలుగులో
గగన చంద్రిక
టపాసుల మెరుపుల్లో
హృదయం కన్నీటి ధారకడుతుంది
గాలికి గాయమై
పర్యావరణ కన్నులు దీనమై
ఆర్తనాథం పాడతాయి
దీపాలు నవ్వగా పండగ సంతోషాల
సౌరభాలు వెదజల్లుతుంది
పచ్చని భూదేవికి
మన చేతులతో రక్షణగా నిలిచి
స్వచ్ఛ దీవెనలతో
జాగృతి విరబూయాలి
పిల్లల ఆనందం
నక్షత్రాల కిరణాలై



ఊపిరి స్వచ్ఛతలో
జీవన సౌందర్యం వెల్లువెత్తాలి
ప్రకృతి పరిమళమై
దీపం ఆత్మలో జ్యోతులు వెలగాలి
టపాసుల గందరగోళం
నిశ్చల ప్రేమలో లీనమైపోయి
ఆనందపు జల్లులతో
దీపావళి సంబరాలు
ప్రకృతి సుమ గంధాలై
హర్షంతో మనసంతా
నిండిపోవాలి.

మండాది గోపీనాథ్
ముక్కుడు దేవులపల్లి
సెల్ బీ 98850 45344


# మండల ప్రజలకు దీపావళి శుభాకాంక్షలు తెలిపిన కాంగ్రెస్ నాయకులు మిగడ శ్రీనివాస్



ముదిగొండ, అక్టోబర్ 19 (సూర్య సేన) : ముదిగొండ మండల ప్రజానీకానికి దీపావళి పండుగ శుభాకాంక్షలు తెలిపిన కాంగ్రెస్ నాయకులు మిగడ శ్రీనివాస్. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దీపావళి పండుగ అంధకారంపై వెలుగుని చెడుపై మేలు గెలిచిన సంకేతమని ఈ పర్వదినం ప్రతి ఇంటా ఆనందం సుఖశాంతులను నింపాలని ఆకాంక్షించారు. ప్రజలందరూ ఐక్యతతో ఆనంద ఉత్సవాలతో ఈ పండుగను జరుపుకోవాలని పిలుపునిచ్చారు. పేదలు నిరుపేదలు స్త్రీలు పిల్లలు అందరికీ వెలుగులు పంచే దీపావళి పర్వదినం సామాజిక సమానత్వానికి ప్రతిగా నిలవాలని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. మండలంలోని ప్రజలకు అభివృద్ధి ఆరోగ్యం సంతోషం కలగాలని కోరిన శ్రీనివాస్ ఈ సందర్భంగా ప్రజలతో స్వయంగా కలిసి దీపాలు వెలిగించి శుభాకాంక్షలు తెలియజేశారు.

# భాగవతుల రామ సోమయాజులు మరణం బాధాకరం....

– తెలంగాణ బ్రాహ్మణ సంఘ సమాఖ్య రాష్ట్ర ఉప అధ్యక్షులు దేవులపల్లి రంగారావు.



రంగారెడ్డి, అక్టోబర్ 19 (సూర్య సేన) : శ్రవణ అపార్ట్మెంట్ 306 హౌస్ ఓనర్ శ్రీ భాగవతుల రామ సోమయాజులు ( 85). రాత్రి 8:45 నిమిషములకుశివైక్యం చెందారు. వారికి భార్య బాలలక్ష్మి ముగ్గురు కుమార్తెలు. గత కొద్ది రోజులుగా అస్వస్థత తో ఉండి శనివారం రాత్రి తుది శ్వాస విడిచారు. వారి అంత్యక్రియలు సోమవారం వారి సొంత ఇంటి నుండి అంత్యక్రియలు ప్రారంభమవుతుంది. వారి మరణానికి అపార్ట్మెంట్ వాసులు ప్రగాఢ సంతాపాన్ని తెలియజేశారు. సంతాపం తెలియజేసిన లక్ష్మీ ప్రసాద్, బలుమూరిలక్ష్మి, విశ్వనాథరెడ్డి,రాజలింగం, నగేష్ ,పి శ్రీనివాసులు, కొప్పుల శ్రీనివాస్ ,గజవాడశ్రీనివాస్ , మురళీధర్ రెడ్డి, మహేందర్ రెడ్డి అశోక్ రాజ్, కందుల తిరుమలరావు, బలుమూరు యోగేంద్రరావు, ఉష , లక్ష్మణాచార్యులు,వజ్రమ్మ,దేవులపల్లి రంగారావు తెలంగాణ బ్రాహ్మణ సేవా సంఘ సమాఖ్య రాష్ట్ర ఉపాధ్యక్షులు. దేవులపల్లి బాలచంద్ర శర్మ తదితరులు పాల్గొని సంతాపం తెలియజేశారు.



# అమరజీవి ఆత్మార్పణానికి మరో కోణం



అక్టోబర్ 19, 1952లో ప్రత్యేక ఆంధ్ర రాష్ట్ర డిమాండ్‌తో పొట్టి శ్రీరాములు మద్రాసులో ఆమరణ నిరాహార దీక్ష ప్రారంభించిన దినం. 50రోజుల నిరహార దీక్ష తరువాత, మద్రాసును వదులుకొంటే ఆంధ్ర రాష్ట్ర నిర్మాణం సాధ్యపడుతుందని ప్రధాని నెహ్రూ ప్రకటించినా, పొట్టి శ్రీరాములు అందుకు అంగీకరించ కుండా తన నిరాహార దీక్షను కొనసాగించి డిసెంబర్ 15వ తేదీన ఆత్మార్పణ చేసుకొన్న నేపథ్యం. అమరజీవి'గా ప్రాచుర్యం పొందిన పొట్టి శ్రీరాములు ఆమరణ దీక్ష చేసి, ఆత్మార్పణం చేసుకున్న నేపథ్యం గురించి భిన్నాభిప్రాయాలు ఉన్నాయి. ఆయన ఆమరణ నిరాహారదీక్ష ఆంధ్ర రాష్ట్ర ఏర్పాటు కోసమే అనే మిగుల ప్రచారంలో ఉన్నా, దాని వెనక మద్రాసు నగర అంశం ప్రధానమని కొందరి అభిప్రాయము. రాష్ట్ర ఏర్పాటు అనేది చాలా తీవ్రమైన రాజకీయ సమస్యగా మారిపోగా, అలాంటి రాజకీయ సమస్య కోసం శ్రీరాములు దీక్ష చేయటానికి ప్రధానంగా మద్రాసు నగర భవిష్యత్తే అని పలు వ్యాసాలను బట్టి మరో కోణానికి బలం చేకూరు తున్నది. మద్రాసు ప్రెసిడెన్సీలో 40 శాతం జనసంఖ్య, 58 శాతం రాష్ట్ర విస్తీర్ణం తెలుగు వారిదే. రాష్ట్ర రాజకీయాలలో తమకు పలుకుబడి లేదని, తమిళుల చేత అవహేళనకు గురౌతున్నామన్న భావన తెలుగు వారిలో మెదలైంది. 1911 లో ఆనాటి వార్తా పత్రికల వ్యాసాల ద్వారా, సంపాదకీయం ద్వారా తెలుగు ప్రజలలో ప్రత్యేక రాష్ట్ర వాంఛ మొదలైంది. 1911 చివరి నాటికి ప్రత్యేక రాష్ట్ర చర్చ ఊపందుకుంది. తెలుగు మాట్లాడే ప్రజలందరూ ఒకే రాష్ట్రంగా ఏర్పడాలనే అభిప్రాయాలు ఆంధ్రరాష్ట్ర ఉద్యమం ప్రారంభమైనప్పటి నుండి వినబడు తుండేది. హైదరాబాద్ సంస్థానం విమోచన తర్వాత సమైక్య తెలుగు రాష్ట్రం ఏర్పాటుకు అవకాశాలు పెరిగాయి. 1949 లో అయ్యదేవర కాళేశ్వరరావు విశాలాంధ్ర మహాసభ ఏర్పాటు చేశారు. 1951 లో కూడా కాంగ్రెస్ అఖిల భారత సమావేశాలలో ఆంధ్ర కాంగ్రెస్ నాయకులు విశాలాంధ్ర విషయాన్ని ప్రస్తావించారు. ఆంధ్ర రాష్ట్రం కోసం చేసిన 58 రోజుల ఆమరణ దీక్షకు ముందు శ్రీరాములు ఐదు సార్లు నిరాహార దీక్షలు చేశారు. నెల్లూరులో దళితులకు ఆలయ ప్రవేశం, అస్పృశ్యత నివారణ మొదలైన వాటికోసం ప్రచారం, నిరాహార దీక్షలు చేసి విజయం సాధించారు. ఈ నేపథ్యంలోనే శ్రీరాములు లక్ష్య సాధన కోసం ఆమరణ దీక్ష ప్రారంభించాలని నిర్ణయించారు. "మద్రాసును కేంద్ర పాలిత ప్రాంతం చేయాలి" అని 1952 సెప్టెంబర్ 15వ తేదీన శ్రీరాములు నెల్లూరు నుంచి భాగవతుల లక్ష్మీ నారాయణకు ఒక లేఖ రాశారు. అందులో.. "ఆంధ్ర రాష్ట్ర సమస్య అనేక మందికి, అనేక పార్టీలకు, అనేక అభిప్రాయాలకు, అనేక భావాలకు అనేక రకాలుగా పుట్టిల్లు అయ్యింది. ప్రతి ఒక్కరి స్వార్థమూ వేర్వేరుగా ఉంది. ప్రత్యక్ష ఆర్థిక లాభాలున్నాయి. కాబట్టి అందరూ పరమార్థ దృష్టితో ఆలోచిస్తే తప్ప ఏకాభిప్రాయానికి రాలేరు. అధికారంలో ఉన్న మహా నాయకుల దృష్టి మార్చాలంటే సామాన్యం కాదు. ఇందుకు ఒక్కటే మార్గం కనబడుతోంది. నిష్కామ దృష్టితో, ద్వేష రహితంగా, నిశ్చింతగా ప్రాణాలర్పించటమే. ఇక ఈ సమస్యను ఉపేక్షించటం పాపమని నిన్నే (1952 సెప్టెంబర్ 14) అనిపించింది". తర్వాత 15 రోజులకు భీమవరంలో స్వామి సీతారాంను శ్రీరాములు కలిసి, లక్ష్మీనారాయణకు రాసిన లేఖను, దానితోపాటు పంపించిన 'ఆంధ్ర రాష్ట్రం' అనే వ్యాసాన్ని చూపించారు. వాటిని పరిశీలించిన స్వామి సీతారాం అక్టోబర్ 2వ తేదీన శ్రీరాములుకు తన స్పందన తెలియజేస్తూ లేఖ రాశారు. దీక్ష చేయాలన్న శ్రీరాములు నిర్ణయాన్ని అభినందిస్తూనే.. "ప్రస్తుతానికి మద్రాసు నగర భవిష్యత్తును గూర్చి పట్టుబట్టడం ఉచితం కాదు" అని సూచించారు. కానీ, ఆయన సూచనను శ్రీరాములు అంగీకరించ లేదు. "మద్రాసు నగర భవిష్యత్తు నిర్ణయించే బాధ్యతను పండిట్ నెహ్రూకు అప్పగించటానికి వీలులేదు. మద్రాసు నగర పౌరులే ఆ నగరం భవిష్యత్తుని నిర్ణయించాలి. నా దీక్ష వలన మద్రాసు నగరంలోని తమిళ ప్రముఖుల్లో కొందరిలోనైనా హృదయ పరివర్తన ఏర్పడి.. మద్రాసు నగరాన్ని కేంద్ర పాలిత రాష్ట్రంగా ఏర్పరచడానికి వారు అంగీకరించగలరని నేను నమ్ముతున్నాను. ప్రజాభీష్టాన్ని అమలు జరపడమే పండిట్ నెహ్రూ వంతు" అని పేర్కొన్నారు. 1952 అక్టోబరు 19వ తేదీన తన దీక్ష ప్రారంభించడానికి ముందు పత్రికలకు శ్రీరాములు ఒక ప్రకటన విడుదల చేశారు. అందులో.. "మద్రాసు నగర భవిష్యత్తు విషయమై మద్రాసు పౌరుల్లో ఏకాభిప్రాయం సాధించడానికి తీవ్రమైన కృషి జరగాలి" అని పేర్కొన్నారు. దీక్షకు ఐదు రోజుల ముందు మద్రాసు పౌరులకు చేసిన విజ్ఞప్తిలో ఆయన ఇలా పేర్కొన్నారు.. "ఆంధ్ర రాష్ట్రం ఏర్పాటు చేయాలని తగినంత ప్రచారం, ఆందోళన, లెక్కల సేకరణ మొదలైనవి ఇప్పటికే జరిగాయి. 1916లోనే ఆంధ్రోద్యమ ప్రచారం ముమ్మరం కావటంతో ప్రత్యేకాంధ్ర రాష్ట్ర స్థాపన సమస్య అందరి దృష్టినీ ఆకర్షించింది. దానివలన కలిగిన తక్షణ ఫలితం అనిబిసెంటు అధ్యక్షతన 1917 డిసెంబరులో కలకత్తాలో జరిగిన కాంగ్రెస్ మహాసభలో ప్రత్యేక ఆంధ్ర రాష్ట్ర కాంగ్రెసు సంఘాన్ని ఏర్పాటు చేయడం. 'ఆ రాష్ట్ర కాంగ్రెసు సంఘం మదరాసు నగరం మీద తక్కిన మదరాసు రాష్ట్ర కాంగ్రెసు సంఘంతో సమానంగా హక్కు కలిగి ఉంటుంది' అని ఒక తీర్మానం కూడా ఆ సందర్భంగా ఆమోదించబడింది." ఆయనదీక్షను చేపట్టాక...విరమించడానికి రెండు షరతులు పేర్కొన్నారు. 1) మద్రాసు నగర భవిష్యత్తు విషయమై మద్రాసు పౌరుల్లో ఏకాభిప్రాయం ఏర్పడటం. 2) భారత ప్రభుత్వం రాజ్యాంగం లోని 3వ ఆర్టికల్ కింద ఆంధ్ర రాష్ట్రాన్ని ఏర్పాటు చేస్తున్నట్లు ప్రకటించటం. ' పొట్టి శ్రీరాములు దీక్ష వెనుక లక్ష్యం గురించి ఆయన మేనల్లుడు ఎన్ఆర్ గుప్తా మాటల్లో.. "మద్రాసు ఉమ్మడి సొత్తుగా ఉండాలని ఆయన అనుకుంటూ వచ్చారు. మద్రాసు మన సొత్తు కావచ్చు. అయితే, వాళ్లు (తమిళులు) మనం చాలా కాలంగా కలసి ఉంటున్నాము. అలాంటప్పుడు మనల్ని వాళ్లు వెళ్లిపొమ్మంటే ఎంత కష్టపడతామో.. వాళ్లను మనం వెళ్లిపొమ్మన్నా అంత కష్టపడతారు. అందువల్ల ఉమ్మడిగా నగరం చేస్తే బాగుంటుందన్నారు." "మరి నిర్వివాద ప్రాంతాలతో చాలామంది రాష్ట్రం కావాలంటున్నారు కదా! అంటే.. 'మనం మద్రాసు ఎందుకు వదులు కోవాలి? వేరేచోటకు వెళ్లి మట్టిలోను, ఇటుకల్లోను రూ. 15-20 కోట్లు ఎందుకు పోసు కోవాలి? ఇంత డబ్బు ఎందుకు వృథా చెయ్యాలి? త్వరగా రాష్ట్రం వస్తుందని ఉన్న హక్కు ఎవరైనా వదులు కుంటారా? అసలు ఆ మాటకు వస్తే మద్రాసుపై మనకు ఎక్కువ హక్కు ఉంది. ఇదంతా గుర్తించే ధార్ కమిటీ మద్రాసును ప్రత్యేక రాష్ట్రం చెయ్యాలని న్యాయంగా తీర్పు చెప్పింది. మన రాజధాని ఈ నగరంలో వద్దు అని అంతా అంటే నేను ఏమంటా? ఆంధ్ర రాష్ట్రపు రాజధాని వేరేచోట పెట్టుకోవచ్చు. అయితే, ఈ వ్యవహారాన్ని సామరస్యంతో పరిష్కరించుకోవాలి." అయితే, మద్రాసు కోసం ఎందుకు ఉపవాసం చేయటం, విడిచి పెట్టవచ్చు కదా? అని తాను అడిగానని, అందుకు శ్రీరాములు స్పందిస్తూ.. "నేను చచ్చిపోవాలని చెయ్యడం లేదు. మనకు న్యాయమైన హక్కు ఉన్నదనటం కోసం చేస్తున్నాను. అదివస్తే సంతోషిస్తాను. రాకపోతే చచ్చిపోతాను. నేను పోతే దీన్ని సాధించటానికి ఎవరికైనా అవకాశం ఉండవచ్చు" అన్నారని గుప్తా తెలిపారు. (ఆంధ్ర పత్రిక: 18 డిసెంబర్ 1952) ప్రకాశం పంతులు మాటల్లో చెప్పాలంటే.. "ఉపవాసం చెయ్యడానికి ఎవ్వరూ స్థలం ఇవ్వకపోతే అట్టలు కట్టుకొని, వీధుల్లో తిరిగి ప్రాణాలైనా అర్పిస్తానన్న పట్టుదల గల మనిషి శ్రీరాములు". ఆయనకు ఆశ్రయం ఇచ్చేందుకు బులుసు సాంబమూర్తి ముందుకు వచ్చారు. పొట్టి శ్రీరాములు 1952 అక్టోబర్ 19వ తేదీన బులుసు సాంబమూర్తి ఇంట్లో ఆమరణ దీక్ష ప్రారంభించారు. 1952 అక్టోబర్ 19వ తేదీ నుంచి డిసెంబర్ 15వ తేదీ వరకు ఆమరణ నిరాహార దీక్ష చేశారు. మద్రాసు లేకుండా ఆంధ్ర రాష్ట్రాన్ని ఏర్పాటు చేస్తున్నట్లు డిసెంబర్ 19వ తేదీన లోక్‌సభలో ప్రధాన మంత్రి జవహర్‌లాల్ నెహ్రూ ప్రకటించారు. ఈ మేరకు వాంఛూ కమిటీని ఏర్పాటు చేశారు. 1953 అక్టోబర్ 1వ తేదీన కర్నూలు రాజధానిగా ఆంధ్ర రాష్ట్రం ఏర్పడింది. 2008 మే 22వ తేదీన నెల్లూరు జిల్లా పేరును శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లాగా మారుస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది.

## సంపాదకీయం

సోమవారం, అక్టోబర్ 20, 2025

### టపాసుల పట్ల అవగాహన ఏదీ..?


టపాసులకు ఆద్యులు చైనీయులు. క్రీ.పూ. 200 సం. లోనే వెదురు (బాంబూ) టపాకాయలు వాడినట్లు ఆధారాలు ఉన్నాయి. దాన్ని చైనా భాషలో బాజు అంటారు. పేలుతున్న వెదురు అని అర్థం. తుపాకి మందు కని పెట్టేంత వరకు వెదురు టపాసులనే చైనా వారు వాడేవారు. క్రీ.శ. 600ల ప్రాంతంలో చైనా వారు తుపాకి మందుని కనిపెట్టారు. గన్ పౌడర్ లేక బ్లాక్ పౌడర్ రసాయన ప్రేలుడు పదార్థం. ఇది గంధకం, చార్కోల్, పొటాషియం నైట్రేట్ ల మిశ్రమం. దీన్ని సాల్ట్ పౌడర్ అంటారు. ఇది మండినప్పుడు 427 నుంచి 464డిగ్రీల ఉష్ణం వెలువడుతుంది. దీని తరువాత చేసేవారు అందుకే టపాసులకు బాజు పేరు స్థిరపడి పోయింది. క్రీ.శ. 900వ సం.లో చైనా నుండి టపాసులు ఇంగ్లాండు అరబ్బు దేశాలు, భారత దేశానికి చేరుకున్నాయి. మనదేశంలో టపాకాయల పరిశ్రమ తమిళనాడులోని శివకాశిలో విస్తరించివుంది. దేశంలోని టపాకాయల ఉత్పత్తిలో 70% శివకాశిలోని 1000కి పైగా పరిశ్రమలలో తయారవు తున్నది. పరిశ్రమలలో పనిచేసే వారు ముఖ్యంగా పసిపిల్లలు. వారిలో 4 నుంచి 16 సం.లోపు వారు 30% మంది వున్నారు. అందులో 90% మంది ఆడ పిల్లలు, పేద పిల్లలు, వెనుకబడిన తరగతివారు.

చేతులకు ఎలాంటి రక్షణ కవచాలు (గ్లౌజులు) లేకుండా ప్రమాదకర రసాయన పదార్థాలలో టపాసులు తయారు చేస్తున్నారు పిల్లలు. రసాయనాల వల్ల శ్వాసకోశ సంబంధ వ్యాధులు, చర్మ వ్యాధులతో బాధ పడుతున్నారు. ప్రభుత్వ చట్టాలు ఎన్ని వున్నా పిల్లలు చేసే ఈ చాకిరీని అరికట్టలేక పోతున్నారు. 1991లో శివకాశిలో ఓ ఫ్యాక్టరీలో జరిగిన ప్రేలుడు వల్ల 39 మంది చనిపోయారు. 65 మంది గాయపడ్డారు. 2009, జూలైలో జరిగిన ప్రమాదంలో 40 మంది చనిపోయారు. ఆగస్టు 2011లో ఫ్యాక్టరీ ప్రమాదంలో 7 మంది చనిపోగా ఐదుగురు గాయపడ్డారు. సెప్టెంబర్ 2012 ప్రమాదంలో 40 మంది చనిపోగా 38 మంది గాయ పడ్డారు. ఇవి అధికారిక లెక్కలు కాగా, నిజానికి ఎక్కువగానే ప్రమాదాలు జరిగి వుంటాయి. టపాకాయలు కాల్చడం వల్ల పర్యావరణం దెబ్బతింటుంది. గాలి కాలుష్యం, శబ్ద కాలుష్యం, రసాయన కాలుష్యం చాలా ఎక్కువగా వుంది. టపాసులు కాల్చినప్పుడు శబ్దం 140 డెసిబెల్స్ దాటుతోంది. ఆరోగ్య పరంగా శబ్దాలు 125 డెసిబెల్స్ దాట కూడదు. ప్రభుత్వ ఉత్తర్వుల ప్రకారం టపాకాయల శబ్ద తీవ్రత 125 డెసిబెల్స్ దాట కూడదు. కానీ టపాకాయల తయారీ కంపెనీలు నియమాన్ని పాటించడం లేదు. ఈ శబ్దాల వల్ల తాత్కాలిక చెవుడు, శాశ్వత చెవుడు ఏర్పడు తున్నది. అధిక శబ్దం వల్ల వినికిడి సమస్యలు, రక్తపోటు, గుండెపోటు, నిద్రలేమి లాంటి సమస్యలు వస్తున్నాయి. ఎన్నో రకాల ప్రమాదాలు పొంచి వున్నాయి. టపాకాయలు కాల్చడంలో అగ్ని ప్రమాదాలు కోకొల్లలు. చేతిలో చిచ్చుబుడ్డి పేలడం, ఒళ్ళుకాలడం, బట్టలు కాలి పోవడం జరుగుతూనే వుంటాయి. చాలా మంది ఆ వెలుగు చూడలేక కళ్ళు పోగొట్టుకున్న సందర్భాలు అనేకం. దీపావళి సందర్భంగా టపాకాయలు కాల్చేటప్పుడు తగిన జాగ్రత్తలు పాటించడం ద్వారా ప్రమాదాలు జరగకుండా నివారించవచ్చు. టపాకాయలు కాల్చేటప్పుడు ఏమాత్రం నిర్లక్ష్యం చేస్తే పెద్ద ప్రమాదాలు సంభవిస్తాయి. బాణ సంచాలను ఇంటిలో కాల్చ కూడదు. ఇంటికి దూరంగా బహిరంగ ప్రదేశాలలో కాల్చడం వల్ల ప్రమాదాలు జరగకుండా ఉంటాయి. టపాకాయలు కొన్నిసార్లు అవి పేలకుండా ఆగిపోతాయి. వాటిని వెంటనే వెళ్లి పట్టుకోవడం లాంటివి చేయకూడదు. ముందుగా వాటిపై నీటిని పోయడం వల్ల వాటి నుంచి ఎలాంటి ప్రమాదం జరిగే అవకాశం ఉండదు.

టపాకాయలు కాల్చేటప్పుడు ముఖ్యంగా ఆల్కహాల్ శానిటైజర్ లను వాడి టపాకాయలను వెలిగించ కూడదు. శానిటైజర్ లకు తొందరగా మండే స్వభావం ఉండటం వల్ల ప్రమాదాలు జరిగే అవకాశం ఉన్నందున దీపావళి రోజు శానిటైజర్ లను వాడక పోవడం మంచిది. టపాకాయలపై ఇచ్చిన సలహాలు సూచనలను ఖచ్చితంగా చదివి పాటించాలి. మంటలు అంటుకునే ప్రదేశాలు... కరెంటు తీగలు, ఎండు గడ్డి, పూరి గుడిసెలు ఉన్న ప్రదేశాలలో బాణా సంచాలు కాల్చ కూడదు. టపాకాయలను కాల్చి వాటిని అలాగే రోడ్డు మీద పడేయడం వల్ల ఆ దారి వెంట వెళ్లే వారికి వాటి నుంచి ప్రమాదం కలగవచ్చు. ఒక బకెట్లో ఇసుక పెట్టుకొని అందులో కాల్చిన కాకర పువ్వులను, టపాకాయలను వేయడం మంచిది. బాణా సంచాలను కాల్చేటప్పుడు ముందస్తు జాగ్రత్తగా ఒక బకెట్ నిండా నీటిని పక్కన ఉంచుకోవాలి. చిన్నపిల్లలకు పెద్దవారే దగ్గరే ఉండి జాగ్రత్తగా టపాకాయలను కాల్పించాలి. వీలైనంత వరకు అందరూ కూడా కాటన్ దుస్తులను ధరించి తగిన జాగ్రత్తలు తీసుకోవాలి. బాణసంచా కాల్చిన తర్వాత పిల్లలు టపాకాయలను కాల్చిన చేతులతోనే ముక్కు, చెవులు, కళ్లను రుద్దుకుంటారు. చేతులను శుభ్రంగా కడుక్కోవాలి. గొంతులో నీళ్లు పోసుకుని గార్గిలింగ్ చేయాలి. గాయం అయితే దాని మీద పదిహేను నిమిషాల పాటు చన్నీరు, వేడి నీరు పోయరాదు.

సూర్యసేన
దినపత్రికలో
అన్ని రకాల ప్రకటనలు
అడ్వర్టైజ్మెంట్స్ మరియు
వార్తల కోసం
సంప్రదించండి: 9951241048

## దీపావళి.... లక్ష్మీ పూజ




దీపమాలికలతో లక్ష్మికి నీరా జనమీయబడే దినం కావటం వల్ల దీపావళి అని నామాంకిత యైనది. నరకలోక వాసులకై దీప ం ఆవళి కల్పించే దినం కనుక దీపావళి అని వాడుక లోని వచ్చింది. దీపావళి అంటే దీపాల సమూహం. హిందూ మత సంప్రదాయానికి దీపావళి పర్వం ఒక చిహ్నం. రాక్షస రాజు బలి చక్రవర్తిని పాతాళానికి విష్ణువు అణగ దొక్కిన దినం కనుక ఒక మహోత్సవంగా పరిగణింప బడుతున్నది. శ్రీరాముడు పట్టాభిషిక్తుడైన దినం కావున ప్రధా న్యత సంతరించుకుంది. విక్రమశక స్థాపకుడైన విక్రమార్క చక్రవర్తి పట్టాభిషేక దినం కూడా ఇదే. లక్ష్మీదేవి ఈనాడు భూలోకానికి దిగి వచ్చి ఇల్లిల్లూ తిరుగుతుందని ప్రజల విశ్వాసం. మధ్యాహ్నం పిండివంటలతో భోజనం, అనంతరం లక్ష్మీదేవి తమ ఇంటికి రావడానికి దారి చూపేందుకే దీపాలంకరణలు. వామనమూర్తి బలిచక్రవర్తిని పాతాళానికి అణచివేసి, ఆయన కారాగారంలో ఉన్న దేవతలను విడుదల చేశారు. అలా విడుదలైన వారిని లక్ష్మీదే వితో పాటు క్షీరసాగరానికి తీసుకెళ్ళారు. ఆ ఆనందానికి స్మారకంగా పండువ ఏర్పడింది. లక్ష్మీదేవికి అత్యంత ప్రీతికరమైనది. అందుకే దీపావళి పర్వది నాన లక్ష్మీపూజ ప్రధాన కార్యంగా మారింది. పెళ్ళి అయిన కొత్త అల్లుళ్ళను హిందువులు పండగకు తప్పక ఆహ్వానిస్తారు. అల్లుని రాక సందర్భంగా సంతోష సూచకంగా బాణాసంచా కాలుస్తారు. భోజన సమయంలో కొత్త దుస్తులు ఇచ్చి గౌరవిస్తారు.

మామతో అల్లుడు కలిసి పంక్తి భోజనం చేస్తారు. రకర కాల పిండి వంటలు వడ్డిస్తారు. ఆశ్వయుజ అమావాస్య విక్రమ సంవత్సరానికి ఆఖరి రోజు. మహారాష్ట్ర ప్రజలు పెదిపూజన్ అంటారు. వారు లక్ష్మీ సరస్వతులను పూజిస్తారు. ఈ నాటి సాయంత్రం జమా ఖర్చులు సరి చూసుకుని, కొత్త పుస్తకాలు పెట్టుకుంటారు. వాటికి పూజ చేస్తారు. నౌకర్లకు బహుమతులు ఇస్తారు. సాయంత్రం దీపాలు వెలిగిస్తారు. దీపావళి నాటి రాత్రి లక్ష్మీపూజ చేసిన తర్వాత నిద్ర పోకుండా ఉండి, అర్ధరాత్రి దాటాక చేటలమీద కర్రలు కొట్టి, డిండిమం అనే వాయిద్యం వాయించాలని శాస్త్ర వచనం. ఆ వాద్యాలే ఇప్పుడు టపాకాయలుగా కాల్చడం జరుగుతున్నది. నరకాసురుడి చావుకి సంతోషించి, భూలోక వాసులు బాణాసంచా కాలుస్తూ వస్తున్నట్లు వాడుక. ఉల్కా - దర్శనం, అగ్గిపుల్లలు, కాకర పువ్వొత్తులు, దీపపు - కడ్డీలు, చిచ్చుబుడ్లు, మతాబులు, తారాజువ్వలు, చేటలు, డిండిమలు, తాటాకు టపాకాయలు ఫిరంగి కాయలు, నేల టపాకాయలు పేల్చుట జరు గుతున్నది. దీపావళి నాటి నుండి నెల రోజులు పెట్టే దీపాలతో క్రిమికీటకాదులు నశిస్తాయి. మందుల కాల్పుల వల్ల దీపాల వెలిగింపు వల్ల వాయువులో కీటకాదులను నశింప చేసే శక్తి ఉంది

## నరక బాధ నివారిణి...నరక చతుర్దశి




ఏ చతుర్దశి నాటి అభ్యంగన స్నానం వల్ల, దీపదానం వల్ల, యమ తర్పణం వల్ల మానవులు నరకబాధ లేకుండా చేసుకుంటారో దానిని "నరక చతుర్దశి" అంటారు. నరక చతుర్దశి ప్రేత చతుర్థశి అని పర్యాయనామం కలిగి, ఈనాడు నరక ముక్తి కోసం యమ ధర్మ రాజును ఉద్దేశించి దీప దానం చేయాలని వ్రత చూడామణి చెపుతున్నది. గుజరాతీయులు నరక చతుర్దశిని "కాల చౌదశ్" అంటారు సంస్కృతంలో "కాళ చతుర్దశి", నరకలోక వాసులకు పుణ్య లోక ప్రాప్తి కలిగించ చేసే ఉత్సవమని, అందుకు ఉద్దేశికమైన కార్యకలాప దిన మని, తమకు నరక లోక భయం లేకుండా చేసుకునే కార్యకలాప దినమని, నరక లోక భయం లేకుండా చేసుకునే చతుర్థశి యని ప్రాచీన గ్రంథాలు వివరి స్తున్నాయి. "చతుర్దశ్యాంతుయే దీపాన్నరకాయ దదంతి చ, తేషాం పితృగణా సర్వే నరకాత్ స్వర్గ మాప్నురయ:. " చతుర్దశి నాడు ఎవరు నరకలోక వాసులకై దీపాలు వెలిగిస్తారో వారి పితృ దేవతలు నరకం నుండి స్వర్గం వెళతారని శాస్త్ర వచనం, చీకటి ఉండగా స్నానం చేయని వారు నరక కూపంలో పడతారని, అందుకే తెలవార కుండా ఈరోజు అభ్యంగన స్నానం చేయాలని నిర్దేశం. ప్రతీ మాసంలోనూ బహుళ చతుర్దశి మాస శివరాత్రి. ఆనాడు కాని, మరు నాడు కాని తెల్లవార కుండా అభ్యంగన స్నానం చేయకూడదనే నిషేధం హిందూ సమాజంలో ఉంది. అయితే ఆశ్వయుజ బహుళ చతుర్దశికి అమావాస్య చూడరు. పైగా ఈనాడు అభ్యంగన స్నానం విధిగా చేయాలని వ్రత చూడామణి మున్నగు గ్రంథాలు స్పష్టం చేస్తున్నాయి. స్నానం చేస్తుండగా తలచుట్టూ దీపం తిప్పడం, టపాసులు కాల్చడం ముఖ్య ఆచారం. వధకు పూర్వం నరకాసు రుడు శ్రీకృష్ణుడు దైవాంశ సంభూతుడని తెలుసుకుని, పరమాత్ముని క్షమాభిక్ష కోరాడు. ఆ పరంధాముడు మన్నించాడు. క్షమా భిక్ష కారణంగానే నరకుడు తనకూ, తన మరణ దినం నాడు స్నానం చేసే వారికీ పాప విముక్తి సంపాదించు కున్నాడు, వేకువ జామునే తైలాభ్యంగన స్నానం చేసి, యమ తర్పణం చేసే వారికి యమ దర్శనం లేదని శాస్త్రం వివరిస్తున్నది. ఆశ్వయుజ బహుళ త్రయోదశి, చతుర్దశి తిధుల మధ్య కాలంలో శ్రీకృష్ణుడు నరకా సురుడిని సంహరించిన సందర్భాన్ని పురస్కరించుకుని ఏడా ఈ దినాన పండువ జరుపుకోవడం ఆచారమైనది. బహుళ చతుర్దశి నాడు చంద్రోదయం ఇరవై ఎనిమిది గడియలకు అవుతుంది. అప్పటికి ఒక గంట మాత్రమే రాత్రి మిగిలి ఉంటుంది. చంద్రుడు ఉండగానే తెల్లవారు జామున తలంటి పోసుకో వాలి, తిలవైలంలో లక్ష్మీదేవి ఉంటుందనే భావనతో చతుర్దశి నాడు నువ్వుల నూనెతో తలంటు కోవడం సంప్రదాయం. ఈనాడు జలమందు గంగాదేవి కళలు సమాహితమై ఉంటాయని శాస్త్ర వచనం. అభ్యంగన స్నానమునకు కావలసిన నీటిని పూర్వదిన రాత్రియందే పాత్రలందు నింపి, ఆ నీటిలోనికి జలాది దేవతను ఆహ్వానించి, సకల మహానదీ దివ్య తీర్థ సాన్నిధ్య మును కలుగ చేసి, పూజించి, ఆ నీటినే ఉదయాత్పూర్వము స్నానమాచరించాలని వివరించ బడింది. స్నాన సందర్భంలో మరికొన్ని విధులు నిర్దేశితాలు. స్నానం చేస్తుండగా తలచుట్టూ దీపం తిప్పడం, టపాసులు కాల్చడం ముఖ్య ఆచారం. వధకు పూర్వం నరకాసు రుడు శ్రీకృష్ణుడు దైవాంశ సంభూతుడని తెలుసుకుని, పరమాత్ముని క్షమాభిక్ష కోరాడు. ఆ పరంధాముడు మన్నించాడుస్నానానికి ఉత్తరేణి, తుమ్మి తగిలిన చెట్ల కొమ్మలతో కలియబెట్టి, కలి పిన జలంలో విద్యుత్ ఉత్పాదనం అవుతుంది కనుక ఓషధుల సమ్మిళితమైన సదరు నీరు ఆరోగ్యకరం కనుక అలా వినియో గించాలి.

నరకబాధ తప్పించేందుకు ఉత్తరేణి ఆకులను తలపై ఉంచు కుని, దక్షిణాభిముఖంగా కూర్చుని, 14 నామాలతో యమ ధర్మరాజుకు తర్పణం చేయాలి. ఈదినం తిల లతో చేసిన పిండి వంటలను తప్పక తినాలి. ప్రదోష కాలమందు దీప దానం చేయాలి. దేవాల యాలలో, మఠాలలో దీప పంక్తులుంచాలి.

సూర్యసేన

సోమవారం, అక్టోబర్ 20, 2025

# మెగా జాబ్ మేళా ఉమ్మడి నల్గొండ జిల్లాలోని నిరుద్యోగ యువతకు ఒక గొప్ప అవకాశం



**- మెగా జాబ్ మేళా పై విస్తృత ప్రచారం కల్పించండి.**
**- ఎక్కువ మంది నిరుద్యోగ యువత జాబ్ మేళాకు హాజరై సద్వినియోగం చేసుకునేలా ఫ్లెక్సీ బ్యానర్లు, హోర్డింగులు, గోడపత్రికలు ఏర్పాటు చేయండి.**
**- జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్**

**కోదాడ ప్రతినిధి, అక్టోబర్ 19 (సూర్య సేన) :** ఈనెల 25న హుజూర్నగర్ లో నిర్వహించనున్న మెగా జాబ్ మేళా పై విస్తృత ప్రచారం కల్పించాలని జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ అధికారులను ఆదేశించారు . ఆదివారం ఆయన మెగా జాబ్ మేళా నిర్వహణపై అదనపు కలెక్టర్ కె. సీతారామారావు తో కలిసి సంబంధిత అధికారులతో టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. ఉమ్మడి నల్గొండ జిల్లాలోని నిరుద్యోగ యువతకు పెద్ద ఎత్తున ఉద్యోగ అవకాశాలు కల్పించాలన్న లక్ష్యంతో రాష్ట్ర నీటిపారుదల, పౌరసరఫరాల శాఖ మంత్రి,కోదాడ ఎం ఎల్ ఏ ఉత్తమ్ పద్మావతి లు ప్రత్యేక శ్రద్ధ తీసుకొని ఈ నెల 25 న హుజూర్నగర్ లోని పెర్ల్ ఇన్ఫినిటీ ఇంటర్నేషనల్ స్కూల్ ( సబ్ రిజిస్టర్ కార్యాలయం వెనక) లో ఉదయం 8 గంటలనుండి జాబ్ మేళా ను నిర్వహించడం జరుగుతున్నదని తెలిపారు.ఈ జాబ్ మేళాకు రాష్ట్రంలోని 150 పెద్ద, పెద్ద కంపెనీలు రానున్నాయని, 5000 వరకు నిరుద్యోగ యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించనున్నాయని ఆయన వెల్లడించారు. ఈ జాబ్ మేళాకు ఎస్ఎస్ సి,ఇంటర్,డిగ్రీ,పి జి,ఐటి ఐ,డిప్లొమా,ఎం బి ఏ,బి టెక్,ఫార్మసీ,తదితర కోర్సులలో ఉత్తీర్ణత కలిగిన, 18 నుండి 40 సంవత్సరాల మధ్య వయసున్న నిరుద్యోగ యువత అర్హులని వివరించారు. అందువల్ల ఈ జాబ్ మేళాలను జిల్లాలోని నిరుద్యోగ యువత సద్వినియోగం చేసుకునే విధంగా విస్తృత ప్రచారం నిర్వహించాలని ఆదేశించారు. ఇందుకుగాను ఫ్లెక్సీలు, బ్యానర్లు, హోర్డింగులు, కరపత్రాలను పెద్ద ఎత్తున ముద్రించాలని , అన్ని పట్టణాలలో జన సమ్మర్థం ఎక్కువగా ఉండే ప్రదేశాలలో ఫ్లెక్సీ బ్యానర్లు, హోర్డింగులు ఏర్పాటు చేయాలని, గోడపత్రికలను బస్సులు కళాశాలల వద్ద అతికించాలని చెప్పారు. జాబ్ మేళాకు వచ్చే నిరుద్యోగ యువతకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా అన్ని సౌకర్యాలు కల్పిస్తున్నామని, జాబ్ మేళా నిర్వహించనున్న పెర్ల్ ఇన్ఫినిటీ ఇంటర్నేషనల్ స్కూల్ పక్కనే ఉన్న స్వర్ణ వేదిక ఫంక్షన్ హాలులో ఉదయం అల్పాహారం మొదలుకొని, మధ్యాహ్న భోజనము, అన్ని వసతులు ఏర్పాటు చేస్తామని చెప్పారు .


నిరుద్యోగ యువత జాబ్ మేళాకు వచ్చి ఉద్యోగాలు పొందే విధంగా రిజిస్ట్రేషన్ చేసుకోవాలని, జాబ్ మేళా హాజరయ్యే వారు 5 సెట్ల రెజ్యూమ్ తో పాటు , ఇటీవలి కాలంలో తీసుకున్న రెండు పాస్ పోర్ట్ సైజ్ ఫోటోగ్రాఫ్ తో సహా హాజరుకావాలని కోరారు. నిరుద్యోగ యువత ఉన్న చోటు నుండే క్యూ ఆర్ కోడ్ ద్వారా ఆన్లైన్లో రిజిస్ట్రేషన్ చేసుకోవచ్చని స్పష్టం చేశారు. జాబ్ మేళా నిర్వహణపై ఈ నెల 22 న రాష్ట్ర నీటిపారుదల, పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తంకుమార్ రెడ్డి ఉదయం 11 గంటలకు సూర్యాపేటలో ఉమ్మడి నల్గొండ జిల్లాలోని కళాశాలల ప్రిన్సిపాల్ లు, తదితరులతో సమావేశం నిర్వహించనున్నారని,, అందువల్ల ఈ సమావేశానికి ప్రిన్సిపల్స్ అందరూ హాజరుకావాలని, సూర్యపేట తో పాటు, నల్గొండ ,యాదాద్రి భువనగిరి జిల్లాల ఇంటర్మీడియట్ విద్యాధికారులతో సమన్వయం చేసుకొని అందరు హాజరయ్యేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఆర్డీవోలు, మున్సిపల్ కమిషనర్లు జాబ్ మేళా నిర్వహణపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని ,ప్రత్యేకించి వారి పరిధిలోని అన్ని కూడళ్ళు, బస్టాండ్లు ,జన సమర్థం ఎక్కువగా ఉన్న ప్రదేశాలలో ఫ్లెక్సీలు, హోర్డింగ్ లు ఏర్పాటు చేయించాలన్నారు. అన్ని బస్సులకు పోస్టర్లు అతికించేలా చూడాలని, ఆర్టీసీని రీజినల్ మేనేజర్ ను ఆదేశించారు. అదనపు కలెక్టర్ కె. సీతారామారావు ,ఆర్డీవోలు, మున్సిపల్ కమిషనర్లు, డిఆర్డిఓ, జిల్లా పరిశ్రమల మేనేజర్, జిల్లా ఇంటర్ వైద్యాధికారి,జిల్లా విద్యాశాఖ అధికారి,జిల్లా ఉపాధి కల్పనాధికారి, ఆర్ టి సి ఆర్ ఎం, తదితరులు, హాజరయ్యారు.

# కాంగ్రెస్ పార్టీతోనే ప్రజల సంక్షేమం సాధ్యం

**- బీఆర్ఎస్, బీజేపీ పార్టీల నుండి కాంగ్రెస్ పార్టీలోకి చేరికలు**
**- తెలంగాణ రాష్ట్ర పర్యాటక అభివృద్ధి సంస్థ చైర్మన్ పటేల్ రమేష్ రెడ్డి**



**సూర్యాపేట టౌన్, అక్టోబర్ 19 (సూర్య సేన) :** కాంగ్రెస్ పార్టీలో రాష్ట్ర అభివృద్ధి ప్రజల సంక్షేమం సాధ్యమవుతుందని తెలంగాణ రాష్ట్ర పర్యాటక అభివృద్ధి సంస్థ చైర్మన్ పటేల్ రమేష్ రెడ్డి అన్నారు. ఆదివారం సూర్యాపేట పట్టణంలోని 16వ వార్డు మరియు 44వ వార్డులకు చెందిన బీఆర్ఎస్, బీజేపీ పార్టీల నాయకులు మరియు కార్యకర్తలు తమ అనుచరులతో కలిసి పెద్దఎత్తున కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ చేరిక కార్యక్రమం బీఆర్ఎస్ జిల్లా నాయకుడు, బీసీ మైనార్టీ నూర్ భాషా ప్రధాన కార్యదర్శి జానీ భాయ్ ఆధ్వర్యంలో జరిగింది. ఈ సందర్భంగా తెలంగాణ రాష్ట్ర పర్యాటక అభివృద్ధి సంస్థ చైర్మన్ పటేల్ రమేష్ రెడ్డి కొత్తగా చేరిన నాయకులు మరియు కార్యకర్తలకు కాంగ్రెస్ పార్టీ కండువా కప్పి స్వాగతం పలికారు. కాంగ్రెస్ పార్టీలో చేరిన వారిలో బిజెపి జిల్లా నాయకులు మాశెట్టి ఉపేందర్ , ఆకుల కిషోర్, తంగెళ్ల రాజేష్, కుమార్, లింగయ్య, రాంబాయి, సురభి సాయబి, షహనా, లక్ష్మమ్మ, విజయ తదితరులు సహా మొత్తం వందమంది నాయకులు, మరియు కార్యకర్తలు ఉన్నారు. ఈ సందర్భంగా పటేల్ రమేష్ రెడ్డి మాట్లాడుతూ ప్రజల సమస్యల పరిష్కారం, అభివృద్ధి దిశగా కాంగ్రెస్ ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలను వివరించారు. ప్రజల విశ్వాసం కాంగ్రెస్ వైపే ఉందని, త్వరలోనే సూర్యాపేటలో పార్టీ మరింత బలపడుతుందని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక కాంగ్రెస్ నాయకులు, యువజన కాంగ్రెస్ కార్యకర్తలు, మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



# నూతన పట్టువస్త్రాలంకరణ మహోత్సవంలో పాల్గొన్న పటేల్ రమేష్ రెడ్డి

**సూర్యాపేట టౌన్, అక్టోబర్ 19 (సూర్య సేన):**
సూర్యాపేట పట్టణంలోని లక్ష్మి గార్డెన్స్‌లో జరిగిన తెలంగాణ రాష్ట్ర పర్యాటక అభివృద్ధి సంస్థ చైర్మన్ పటేల్ రమేష్ రెడ్డి వ్యక్తిగత సహాయకుడు (పిఏ) పాలకుర్తి సైదులు %-% మౌనిక దంపతుల కుమార్తెలు అంజలి, దీక్షితల
నూతన పట్టువస్త్రాలంకరణ మహోత్సవంలో పాల్గొని కుటుంబ సభ్యులను ఆశీర్వదించారు. చిన్నారులను ఆశీర్వదించిన వారిలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు ప్రముఖ వైద్యులు డాక్టర్ ఊర



రామ్మూర్తి యాదవ్, మాజీ కౌన్సిలర్లు నిమ్మల వెంకన్న, తండు శ్రీనివాస్ గౌడ్, జ్యోతి కరుణాకర్, నాయకులు సైదిరెడ్డి తదితరులు ఉన్నారు.




# దీపాల కాంతులవలె ప్రతి ఇంటా వెలుగులు నిండాలి

**- మాజీమంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే జగదీష్ రెడ్డి**



**సూర్యాపేట, అక్టోబర్ 19 (సూర్య సేన) :** చీకటిని పారద్రోలే వెలుగుల పండుగ దీపావళి అని.. దీపాల కాంతులవలె తెలంగాణలోని ప్రతి ఇంటా వెలుగులు నిండాలని ఆకాంక్షిస్తూ దీపావళి పండుగ సందర్భంగా ప్రజలందరికీ మాజీమంత్రి వర్యులు, సూర్యాపేట శాసన సభ్యులు గుంటకండ్ల జగదీష్ రెడ్డి శుభాకాంక్షలు తెలిపారు. చెడుపై మంచి సాధించిన విజయానికి ప్రతీకగా దీపావళి పండుగను జరుపుకుంటామన్నారు. చీకటిని పారద్రోలే వెలుగుల పండుగతో తెలంగాణ లోనూ చీకట్లు తొలగి మళ్లీ అభివృద్ధితో వెల్లివిరియాలన్నారు. అగ్ని కొలువైన దీపాల వెలుగులు మనలో అజ్ఞానాంధకారాన్ని తొలగించి, చైతన్యాన్ని రగిలించాలన్నారు. అలాగే బాణసంచా పేల్చేటప్పుడు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని.. చిన్నపిల్లలను బాణాసంచాకు దూరంగా ఉంచాలని సూచించారు.

# అనంతగిరి నూతన ప్రెస్ క్లబ్ ఎన్నిక..

**- అధ్యక్షుడిగా గుడిమెట్ల రామకృష్ణ, ప్రధాన కార్యదర్శిగా ఇరుగు వెంకటేశ్వర్లు**



**కోదాడ ప్రతినిధి, అక్టోబర్ 19 (సూర్యసేన) :** జర్నలిస్టుల సమస్యలపై నిరంతరం పోరాడుతామని నూతన ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు గుడిమెట్ల రామకృష్ణ,ప్రధాన కార్యదర్శి ఇరుగు వెంకటేశ్వర్లు అన్నారు. ఆదివారం జర్నలిస్టుల సంఘం యూనియన్ నాయకులు, జిల్లా మాజీ ప్రెస్ క్లబ్ అధ్యక్షులు కారింగుల అంజన్ గౌడ్ ఆదేశాలతో, టియుడబ్ల్యూజే హెచ్ 143 యూనియన్ కోదాడ ప్రెస్ క్లబ్ అధ్యక్షులు కొలిచలం నరేష్ సూచనలతో మండల కేంద్రంలో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సమావేశంలో క్లబ్ సభ్యులు ఏకగ్రీవంగా రామకృష్ణ, వెంకటేశ్వర్లకు మద్దతు తెలిపారు.

వరుసగా మూడోసారి అధ్యక్షుడిగా ఎన్నికైన రామకృష్ణకు, రెండవసారి ప్రధాన కార్యదర్శిగా నియమితులైన వెంకటేశ్వర్లకు సభ్యులు శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం వారిరువురూ మాట్లాడుతూ సమాజ సేవలో నాలుగో స్తంభంగా పిలువబడే జర్నలిస్టుల సేవలను గుర్తించాలని నిత్యం వార్తా సేకరణతో ప్రజలకు అవగాహన కల్పించి వారిని మేల్కొల్పే విధంగా జర్నలిస్టులు వ్యవహరిస్తున్న తీరు అమోఘం అని అన్నారు. అలాంటి జర్నలిస్టులను ప్రభుత్వం గుర్తించి వారి సమస్యలను పరిష్కరించే దిశగా పాటుపడాలని కోరారు. నూతనంగా ఏర్పాటు చేసిన ప్రెస్ క్లబ్ తమ సమస్యలపై నిత్యం పోరాటం చేస్తూ వారి అభ్యున్నతికి కృషి చేస్తామని వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో జర్నలిస్టులు కొలిచలం శ్రీను, బూరా సత్యనారాయణ, మట్టపల్లి ఉపేందర్, గద్దె రాంబాబు, బెల్లంకొండ సతీష్, బానోత్ రవి, శ్రీరామ్ రవి, కొలిచలం హరిబాబు పాల్గొన్నారు.

# నిరుద్యోగులు జాబ్ మేళాలను సద్వినియోగం చేసుకోవాలి

**- వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ కొప్పుల వేణారెడ్డి**



**భానుపురి, అక్టోబర్ 19 (సూర్య సేన) :** నిరుద్యోగులు మెగా జాబ్ మేళాలను సద్వినియోగం చేసుకోవాలని వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ కొప్పుల వేణారెడ్డి అన్నారు. ఆదివారం సూర్యాపేట జిల్లా హుజూర్నగర్ పట్టణంలో సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం వెనుక పెర్ల్ ఇన్ఫినిటీ ఇంటర్నేషనల్ స్కూల్ వద్ద ఇరిగేషన్,కమాండ్ ఏరియా డెవలప్మెంట్, ఆహార, సివిల్ సప్లై శాఖ మంత్రి ఎన్. ఉత్తమ్ కుమార్ రెడ్డి సారధ్యంలో నిర్వహిస్తున్న మెగా జాబ్ మేళా కరపత్రంను ఆవిష్కరించారు. అనంతరం వారు మాట్లాడారు.ఈ నెల 25వ తారీఖున జరిగే మెగా జాబ్ మేళా కు సూర్యాపేట నియోజకవర్గం నుండి నిరుద్యోగ యువత ప్రతి ఒక్కరు వచ్చే విధంగా ఏర్పాట్లు చేస్తున్నామని తెలిపారు. సింగరేణి కాలరీస్ కంపెనీ లిమిటెడ్ తెలంగాణ డిజిటల్ ఎంప్లాయిమెంట్ ఎక్స్చేంజ్ సాకారంతో ఉద్యోగాల కోసం హైదరాబాద్ వెళ్ళకుండా ఉండాలనే ఉద్దేశంతో 150 ప్రైవేట్ సంస్థలు, 2వేల నుండి 5వేల ఉద్యోగ అవకాశాలు కల్పిస్తున్నామన్నారు. సూర్యాపేట జిల్లా కేంద్రంలో ఉన్నటువంటి కాలేజీల యాజమాన్యంతో మాట్లాడి అత్యధిక యువతను జాబ్ మేళాకు తీసుకెళ్తామని అన్నారు. ఈ జాబ్ మేళా కు పదవ తరగతి, ఇంటర్, ఐటిఐ,డిప్లొమా,ఎంబీఏ,బీటెక్,పీజీ,ఫార్మసీ అర్హతలు కలిగి వయసు18 నుండి 40 సంవత్సరాల వరకు ఉండాలన్నారు. సూర్యాపేట జిల్లా యువతకు ఇది ఒక మంచి అవకాశమని తెలిపారు.



# దీపావళి శుభాకాంక్షలు.......



## సూర్య సేన పత్రిక పాఠకుల కోసం ఈ దీపావళి ప్రత్యేకం..

**అక్టోబర్ 18 (సూర్య సేన) :** దీపావళి అనేది భారతీయ సంస్కృతిలో అత్యంత ప్రాచుర్యం పొందిన పండుగలలో ఒకటి. దీన్ని "దీపాల పండుగ"గా కూడా పిలుస్తారు. దీపావళి అనేది కేవలం ఒక పండుగ మాత్రమే కాదు, ఇది వెలుగుల విజయాన్ని, చీకటి మీద వెలుగు సాధించిన విజయాన్ని, మంచి మీద చెడు ఓడిన ఘట్టాన్ని సూచించే పవిత్రమైన సందర్భం.

– దీపావళి పుట్టుక %–% పురాణాల ప్రకారం

దీపావళి పుట్టుకకు అనేక పురాణ కథలు ఉన్నాయి. ముఖ్యంగా మూడు ప్రధాన కథలు ప్రజలలో ప్రసిద్ధి చెందాయి:

రామాయణం ఆధారం: శ్రీరాముడు 14 సంవత్సరాల అరణ్యవాసం ముగించుకుని రావణాసురుని సంహరించి అయోధ్యకు తిరిగి వచ్చిన సందర్భంలో ప్రజలు ఆనందంతో దీపాలు వెలిగించి స్వాగతం పలికారు. అప్పటి నుండి దీపావళిని జరుపుకుంటున్నారు.

నరకాసుర వధ: శ్రీకృష్ణుడు నరకాసురుని సంహరించి 16,000 మంది స్త్రీలను విముక్తి చేసిన సందర్భాన్ని గుర్తుగా దీపావళిని జరుపుకుంటారు. ఇది చెడు మీద మంచి సాధించిన విజయానికి ప్రతీకగా భావిస్తారు.

లక్ష్మీదేవి అవతరణ: సముద్రమథన సమయంలో లక్ష్మీదేవి ప్రాకట్యం చెందిన రోజు దీపావళి అని కూడా ఒక విశ్వాసం ఉంది. అందుకే ఈ రోజు లక్ష్మీదేవిని పూజించడం ఆనవాయితీగా మారింది.

దీపావళి యొక్క ఆధ్యాత్మిక ప్రాముఖ్యత

దీపావళి అనేది ఆత్మ విజ్ఞానానికి ప్రతీక. దీపం వెలిగించడం ద్వారా మనలోని చీకటి భావాలను పారద్రోలడం, జ్ఞానాన్ని వెలిగించడం అనే భావన ఉంది.

ఈ పండుగ సమయంలో లక్ష్మీ పూజ చేయడం ద్వారా సంపద, శ్రేయస్సు, శాంతి కోరుతారు.

విష్ణుమూర్తిను, గణపతి దేవుడిని, సరస్వతీ దేవిని కూడా పూజించడం ద్వారా విద్య, విజయం, ఐశ్వర్యం కోరుకుంటారు.

– సామాజిక మరియు సాంస్కృతిక ప్రాముఖ్యత

దీపావళి సమయంలో కుటుంబ సభ్యులు, బంధువులు కలిసి ఉత్సాహంగా పండుగను జరుపుకుంటారు. ఇది సామూహిక ఐక్యతకు ప్రతీక.

బాణసంచా కాల్చడం, ఇంటిని దీపాలతో అలంకరించడం, కొత్త బట్టలు ధరించడం, స్వీట్లు పంచుకోవడం వంటి సాంప్రదాయాలు ఈ పండుగను మరింత ప్రత్యేకంగా చేస్తాయి.

వ్యాపారవేత్తలు దీపావళిని నూతన ఆర్థిక సంవత్సర ప్రారంభంగా భావించి, కొత్త ఖాతాలను ప్రారంభిస్తారు.

– ప్రాంతాల వారీగా దీపావళి

భారతదేశం అంతటా దీపావళిని వివిధ రకాలుగా జరుపుకుంటారు:

ఉత్తర భారతదేశంలో శ్రీరాముని అయోధ్య రాకను గుర్తుగా జరుపుకుంటారు.

దక్షిణ భారతదేశంలో నరకాసురుని వధను గుర్తుగా ఉత్సవాలు నిర్వహిస్తారు.

పశ్చిమ భారతదేశంలో లక్ష్మీ పూజకు ప్రాధాన్యత ఇస్తారు.

జైనులు మహావీరుని నిర్యాణాన్ని గుర్తుగా దీపావళిని జరుపుకుంటారు.

– దీపావళి యొక్క ఆధునిక ప్రాముఖ్యత

ఈ కాలంలో దీపావళి పండుగకు కొత్త రంగులు వచ్చాయి. పండుగను పర్యావరణ హితంగా జరుపుకోవాలని ప్రజల్లో అవగాహన పెరుగుతోంది. బాణసంచా వాడకాన్ని తగ్గించి, దీపాలతో, ప్రకాశంతో పండుగను జరుపుకోవాలని పిలుపు ఇస్తున్నారు.

– ముగింపు

దీపావళి అనేది కేవలం ఒక పండుగ మాత్రమే కాదు. ఇది మన సంస్కృతి, సంప్రదాయాల ప్రతిబింబం. దీపావళి మన జీవితాల్లో వెలుగును నింపే, మనసులను ఆనందంతో నింపే పండుగ. ఈ పండుగను మనం శుభ్రతతో, సద్భావనతో, పర్యావరణాన్ని కాపాడుతూ జరుపుకోవాలి. అంగరంగవైభవంగా ఘనంగా దీపావళి పండుగ జరుపుకోవడానికి యావత్ భారతదేశం సిద్ధమవుతోంది. అక్టోబర్ 20వ తేదీన దీపావళి పండుగ జరుపుకోనున్నారు. ఈ రోజున లక్ష్మీపూజ సాయంత్రం పూట అంటే సూర్యాస్తమయం అయిన తర్వాత దీపాలు పెట్టే సమయంలో ఆచరిస్తారు. ఈ పండుగ వేళ ఇంటి ముందు అందమైన ముగ్గులు, పూల తోరణాలు, కళకళలాడే దీపాలతో లక్ష్మీదేవిని ఆహ్వానిస్తారు. ఈక్రమంలో దీపావళి శుభాకాంక్షలు అందంగా ఎలా చెప్పాలో చూద్దాం.. దీపాల పండుగ.. దీపావళి పండుగ వేళ లక్ష్మీదేవిని ఇంటికి ఆహ్వానిస్తూ.. అమ్మవారి అనుగ్రహంతో సిరిసంపదలు కలగాలని అందరూ సుఖసంతోషాలతో ఉండాలని ప్రత్యేక పూజలు ఆచరిస్తారు. ఈ దీపావళి పండుగ జరుపుకోవడం తరతరాలుగా, యుగయుగాలుగా వస్తూనే ఉంది. వివరాల్లోకెళ్తే.. శ్రీకృష్ణుడు, సత్యభామ సమేతుడై నరకాసురుని సంహారం చేశారు. ఆ విజయానికి చిహ్నంగా నరక చతుర్దశిగా జరుపుకుంటారు. మరుసటి రోజు దీపాలు వెలిగించి దీపావళి పండుగ జరుపుకుంటారు.





# ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభం



**– రైతులు శ్రమించి పండించిన ప్రతి ధాన్యాన్ని ప్రభుత్వం పూర్తిగా కొనుగోలు చేస్తుంది.**

**– నాణ్యమైన ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాలకు తీసుకువచ్చి, ప్రభుత్వం నిర్ణయించిన గిట్టుబాటు ధరలు పొందాలి.**

**– వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ కొప్పుల వేణారెడ్డి**

**సూర్యాపేట టౌన్, అక్టోబర్ 18 (సూర్య సేన) :** సూర్యాపేట పట్టణంలోని 6వ వార్డు (దాసాయిగూడెం), 4వ వార్డు(రాంకోటి తండా), (దుబ్బా తండా) పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ (మెప్మా) ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కోనుగోలు కేంద్రాలను వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ కొప్పుల వేణారెడ్డి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు అంజద్ అలి, పిసిసి ఎస్సి సెల్ వైస్ చైర్మన్ చింతమళ్ళ రమేష్, దండు మైసమ్మ దేవస్థానం చైర్మన్ తంగేళ్ళ కరుణాకర్ రెడ్డి, జిల్లా కాంగ్రెస్ నాయకులు చిలుముల సునీల్ రెడ్డి,



పందిరి మల్లేష్ గౌడ్, ధారవత్ నాగు నాయక్, 4వ వార్డు మాజీ కౌన్సిలర్ మకట్ లాల్ లక్ష్మీ, 4వ వార్డు కాంగ్రెస్ పార్టీ నాయకులు కృష్ణ,మెప్మా సిబ్బంది శ్వేతా, ఆర్పీ తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థుల ప్రతిభను వెలికితీసేందుకు స్కాలర్ షిప్ టెస్ట్



**కోదాడ ప్రతినిధి, అక్టోబర్ 19 (సూర్యసేన) :** పదవ తరగతి విద్యార్థులలో దాగి ఉన్న ప్రతిభను వెలికితీసి వారికి ప్రోత్సాహం అందించేందుకు క్రినిధి ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆదివారం స్కాలర్‌షిప్ టెస్ట్ నిర్వహించారు. కోదాడ పట్టణంలోని హుజూర్‌నగర్ రోడ్‌లో గల ఎన్.ఆర్.ఎస్. కాలేజ్ ఆవరణలో జరిగిన ఈ పరీక్షలో సుమారు 950 మంది విద్యార్థులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఫౌండేషన్ నిర్వాహకులు, ఎన్.ఆర్.ఎస్. కాలేజ్ చైర్మన్ వద్దే రాజేష్ చౌదరి మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లోని ప్రతిభావంతులైన విద్యార్థులను గుర్తించి, వారికి అవసరమైన మార్గదర్శకత్వం అందించి జాతీయ స్థాయిలో ర్యాంకర్లుగా తీర్చిదిద్దేందుకు ప్రయత్నిస్తున్నామని తెలిపారు. స్కాలర్‌షిప్ టెస్ట్‌కు విద్యార్థుల నుండి అపూర్వమైన స్పందన లభించిందని పేర్కొన్నారు. ఈ పరీక్షలో బాలికల విభాగంలో షేక్ మానా ఫస్ట్ ప్రైజ్, షేక్ సమీరా సెకండ్ ప్రైజ్ సాధించగా, బాలుర విభాగంలో వీ. శశాంక్ ఫస్ట్ ప్రైజ్, బి. పరశురామ్ సెకండ్ ప్రైజ్ సాధించారు. మొత్తం పది మంది విద్యార్థులకు బహుమతులు అందజేశారు. విజేతలకు చైర్మన్ రాజేష్ చౌదరి బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్ మనోహర్ రెడ్డి, కరెస్పాండెంట్ వేణుగోపాల రావు, ప్రిన్సిపాల్ జీ. వెంకటరమణ, అకడమిక్ అడ్వైజర్ మైనం రామయ్య, వైస్ ప్రిన్సిపాల్ పీ.ఎన్.ఆర్, క్యాంపస్ ఇన్‌చార్జ్‌లు మౌనిక, ప్రవీణ్, పీఆర్వో మల్లికార్జునరావు, లెక్చరర్లు, సిబ్బంది, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.





# తెలంగాణ రాష్ట్ర ప్రజలందరికీ దీపావళి పండుగ శుభాకాంక్షలు



**– తెలంగాణ భారీ నీటిపారుదల మరియు సివిల్ సప్లై శాఖ మంత్రి నలమాద ఉత్తం కుమార్ రెడ్డి**

**హైదరాబాద్, అక్టోబర్ 19 (సూర్య సేన) :** తెలంగాణ రాష్ట్ర ప్రజలకు తెలంగాణ రాష్ట్ర భారీ నీటిపారుదల మరియు సివిల్ సప్లై శాఖ మంత్రి ఉత్తంకుమార్ రెడ్డి దీపావళి పండుగ శుభాకాంక్షలు తెలిపారు.ఈ దీపావళి పండుగ ప్రతి ఒక్కరి జీవితం లో వెలుగును నింపాలని మనస్ఫూర్తిగా, సుఖ సంతోషాలు, సిరి సంప దలు, సౌభాగ్యం,సమృద్ధి ఎల్లప్పుడూ అందరి ఇండ్లలో వెల్లివిరియాలని కోరు కుంటూ తగు జాగ్రత్తలతో కుటుంబ సభ్యులందరు కలిసి దీపావళిని ఆనందంగా జరుపుకోవాలని ఆకాంక్షించారు.

# జిల్లా ప్రజలందరికీ దీపావళి పండుగ శుభాకాంక్షలు



**సూర్యాపేట, అక్టోబర్ 19 (సూర్య సేన) :** సూర్యాపేట జిల్లా ప్రజలందరికీ దీపావళి పండుగ శుభాకాంక్షలు అని సుధాకర్ పివిసి మేనేజింగ్ డైరెక్టర్ మీలా మహదేవ్ తెలిపారు. ఆదివారం సూర్య సేన తెలుగు దినపత్రిక ప్రతినిధితో మాట్లాడారు. చీకట్లను పారద్రోలి ప్రతి ఇంట్లో వెలుగులు నిండాలని, రాబోయే కాలంలో తెలంగాణ రాష్ట్రంలో అభివృద్ధి జరగాలని ప్రజలందరూ సుఖ సంతోషాలతో ఉండాలని కోరుకున్నారు.

ప్రజల ఇండ్లలో దీపావళి వెలుగులు విరజిమ్మాలని, ఆనందోత్సవాలతో ఉండాలని, పిల్లలు, పెద్దలు బాణాసంచా కాల్చుకుంటూ వెలుగులతో నిండాలని పేర్కొన్నారు.

# తెలంగాణ నమో మంత్ర ఫౌండేషన్ అధ్యక్షులుగా డాక్టర్ ఏ. ఎస్. శ్రీనివాస్....



**రంగారెడ్డి, అక్టోబర్ 19 (సూర్య సేన) :** తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులుగా నమో మంత్ర ఫౌండేషన్ కు, తెలంగాణ రాష్ట్రానికి చెందిన, డాక్టర్ ఏ. యస్ శ్రీనివాస్ నునియమించినట్లు నమో మంత్ర ఫౌండేషన్ జాతీయ కార్యదర్శి యర్రం వెంకటరెడ్డి తెలిపారు.

శనివారం పత్రికలకు ఒక ప్రకటన విడుదల చేస్తూ జాతీయ భావాలు కలిగి ఎన్నో సామాజిక కార్యక్రమాల్లో పాల్గొంటున్న తెలంగాణకు చెందిన, డాక్టర్ ఆకెళ్ళ శ్రీనివాస్ కు తెలంగాణ రాష్ట్ర బాధ్యతలు అప్పజెప్తున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ, నమో మంత్ర ఫౌండేషన్ కేంద్ర ప్రభుత్వం తనపై పెట్టుకున్న నమ్మకాన్ని వమ్ము చేయకుండా తన వంతు బాధ్యతలను నిర్వహిస్తానని, నమో మంత్ర ఫౌండేషన్ తనకు అప్పజెప్పిన పనిని, చిత్తశుద్ధితో నిర్వహిస్తానని పేర్కొన్నారు. అదేవిధంగా భారత ప్రధాని నరేంద్ర మోడీ దేశవ్యాప్తంగా ప్రవేశపెట్టిన పథకాలు వికసిత భారత్ నుండి, ప్రతి కార్యక్రమాన్ని ప్రజల్లోకి తీసుకు వెళ్లేందుకు తన వంతు కృషి చేస్తానని, క్షేత్రస్థాయిలో పనిచేసేందుకు కేంద్ర ప్రభుత్వ ఆదేశాలను పరిగణనలోకి తీసుకొని కార్యకర్తల మధ్య పని చేసినందుకు సామాన్య కార్యకర్తగా ఈరోజు నుండే, ప్రతిజ్ఞ చేస్తున్నాను అని శ్రీనివాస్ అన్నారు.

# విదేశీ మారకం నిల్వల్లో పతనం....



ముంబై, అక్టోబర్, 19 (సూర్యసేన ప్రతినిధి): భారతదేశ విదేశీ మారకం నిల్వల్లో మరోమారు తగ్గుదల చోటు చేసుకుంది. అక్టోబర్ 10తో ముగిసిన వారంలో 2.18 బిలియన్ డాలర్లు తగ్గి 697.78 బిలియన్లకు చేరుకున్నాయని రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్బీఐ) తెలిపింది. ఇది ఇంతక్రితం వారం అక్టోబర్ 3న నమోదైన 699.96 బిలియన్లతో పోల్చితే తగ్గుదలను సూచిస్తుందని పేర్కొంది. ఫారెక్స్ నిల్వలలో ప్రధాన భాగం అయినా విదేశీ కరెన్సీ ఆస్తులు సమీక్షా వారంలో 5.61 బిలియన్ డాలర్లు తగ్గి 572.10 బిలియన్లకు పరిమితమయినట్టు ఆర్బీఐ తెలిపింది. ఈ ఆస్తులలో యూరో, యెన్, పౌండ్ వంటి కరెన్సీలు డాలర్‌తో పోలిస్తే విలువలో హెచ్చు తగ్గులు చెందడం ఈ తగ్గుదలకు కారణం. ఇటీవల డాలర్‌తో రూపాయి మారకం విలువ పడిపోవడంతో ఈ విలువ తగ్గింది.

అదే సమయంలో బంగారం నిల్వలు 3.60 బిలియన్లు పెరిగి 102.37 బిలియన్లకు చేరాయి. స్పెషల్ డ్రాయింగ్ రైట్స్ (ఎస్‌డిఆర్) 18.68 బిలియన్ డాలర్లకు తగ్గాయని వెల్లడించింది. ఫారెక్స్ నిల్వలలో ప్రధాన భాగం అయినా విదేశీ కరెన్సీ ఆస్తులు సమీక్షా వారంలో 5.61 బిలియన్ డాలర్లు తగ్గి 572.10 బిలియన్లకు పరిమితమయినట్టు ఆర్బీఐ తెలిపింది. ఈ ఆస్తులలో యూరో, యెన్, పౌండ్ వంటి కరెన్సీలు డాలర్‌తో పోలిస్తే విలువలో హెచ్చు తగ్గులు చెందడం ఈ తగ్గుదలకు కారణం.

ఇటీవల డాలర్‌తో రూపాయి మారకం విలువ పడిపోవడంతో ఈ విలువ తగ్గింది. అంతర్జాతీయ ద్రవ్య నిధి (ఐఎంఎఫ్)లో భారతదేశ నిల్వలు 36 మిలియన్ డాలర్లు తగ్గి 4.63 బిలియన్లుగా చోటు చేసుకున్నాయి.

## ఇకపై 36 నెలలు ఆగాల్సిందే.. పీఎఫ్‌లో మారిన ఈ రూల్స్

ముంబై, అక్టోబర్, 19 (సూర్యసేన ప్రతినిధి): ఉద్యోగుల కోసం ఈపీఎఫ్‌వో కీలక నిర్ణయాలు తీసుకుంది. ఇప్పుడు జాబ్ పోయినా, పీఎఫ్ డబ్బులు తీసుకోవడం చాలా ఈజీ అయింది. జాబ్ లేకపోతే పీఎఫ్ డబ్బుల్లో 75శాతం వరకు వెంటనే తీసుకోవచ్చు, మిగిలిన 25శాతం ఒక సంవత్సరం తర్వాత తీసుకోవచ్చు. అయితే పెన్షన్ డబ్బులు తీసుకోవడానికి మాత్రం 36 నెలలు ఆగాల్సి ఉంటుంది. ఉద్యోగులకు ఎంప్లాయీస్ ప్రావిడెంట్ ఫండ్ ఆర్గనైజేషన్ మరో గుడ్ న్యూస్ తెలిపింది. పీఎఫ్ విషయంలో కీలక మార్పులు చేసింది. ఈ రూల్స్ మనీ విత్ డ్రాను మరింత ఈజీగా మార్చనున్నాయి. జాబ్ కోల్పోయిన ఉద్యోగుల కోసం ప్రభుత్వం ఒక మంచి నిర్ణయం తీసుకుంది. ఒక వ్యక్తికి ఉద్యోగం పోయి, ఖాళీగా ఉంటే, వాళ్ళు తమ పీఎఫ్ డబ్బుల్లో 75శాతం వరకు వెంటనే తీసేసుకోవచ్చు. ఇంకా ఉద్యోగం దొరకకపోతే మిగిలిన 25శాతం డబ్బును ఒక సంవత్సరం తర్వాత తీసుకోవడానికి అవకాశం ఉంది. ఇక్కడ నిరాశ కలిగించే విషయం ఏంటంటే.. జాబ్ పోయిన తర్వాత మీ పెన్షన్ స్కీమ్ డబ్బులు తీసుకోవాలంటే ఇకపై కేవలం 2 నెలలు కాదు.. ఏకంగా 36 నెలలు ఆగాల్సి ఉంటుంది.




## ఎంఇఐఎల్‌కు కువైట్ కంపెనీ భారీ ఆర్డర్!

ముంబై, అక్టోబర్, 19 (సూర్యసేన ప్రతినిధి): కువైట్ ఆయిల్ కంపెనీ (కెఒసి) నుంచి భారీ ఆర్డర్‌ను దక్కించుకున్నట్లు మేఘా ఇంజినీరింగ్ అండ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్స్ లిమిటెడ్ (ఎంఇఐఎల్) వెల్లడించింది. కెఒసి నుంచి ఏకంగా 225.5 మిలియన్ అమెరికన్ డాలర్ల (దాదాపు రూ.1984 కోట్లు) విలువైన ఈ ప్రాజెక్ట్ ఆర్డర్‌తో మరో అంతర్జాతీయ మైలురాయిని అధిగమించామని ఆ సంస్థ శుక్రవారం ఓ ప్రకటనలో వెల్లడించింది. కెఒసి బూస్టర్ స్టేషన్ బిఎస్ 171 సమీపంలో ఈ ప్లాంట్ ను 790 రోజుల్లో ఎంఇఐఎల్ నిర్మించి ఆ తరువాత ఐదు సంవత్సరాల పాటు నిర్వహించడానికి ఒప్పందం కుదర్చుకుంది. బిల్డ్ ఓన్ ఆపరేట్ పద్ధతిలో వెస్ట్ కువైట్ ఆయిల్‌ఫీల్డ్స్‌లో కొత్త గ్యాస్ స్వీటెనింగ్, సల్ఫర్ రికవరీ ఫెసిలిటీ (ఎన్‌జిఎస్ఎఫ్ ) రూపకల్పన, నిర్మాణ, నిర్వహణ, సంరక్షణ బాధ్యతలను ఎంఇఐఎల్ చేపట్టనుంది. ఎస్ఆర్‌యులో నాలుగు శాతం హైడ్రోజన్ సల్ఫైడ్, 10 శాతం వరకు కార్బన్ డైఆక్సైడ్ ఉన్న 120 మిలియన్ స్టాండర్డ్ క్యుబిక్ ఫీట్ల (ఎంఎంఎస్‌సిఎఫ్‌డి) సౌర్ గ్యాస్‌ను శుద్ధి చేసే ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని ఎంఇఐఎల్ ఏర్పాటు చేయనుంది.

## భారత జీడీపీ అంచనాను 6.7 శాతానికి పెంచిన ఈవై



ముంబై, అక్టోబర్, 19 (సూర్యసేన ప్రతినిధి): ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి సంబంధించి భారత జాతీయోత్పత్తి(జీడీపీ) అంచనాలను పెంచుతున్నట్లు ప్రముఖ ప్రొఫెషనల్ సర్వీసెస్ సంస్థ ఈవై తాజా నివేదికలో తెలిపింది. 'ఎకానమీ వాచ్ ' నివేదిక ప్రకారం, జూన్ త్రైమాసికంలో వృద్ధి మెరుగ్గా ఉండటం, వస్తు, సేవల పన్ను(జీఎస్టీ) సంస్కరణల నేపథ్యంలో గతంలో అంచనా వేసిన 6.5 శాతం నుంచి దేశ జీడీపీ 6.7 శాతం పెరుగుతుందని భావిస్తున్నట్లు వెల్లడించింది. తొలి త్రైమాసికంలో వాస్తవ జీడీపీ వృద్ధి 7.8 శాతమని ప్రభుత్వం ప్రకటించడం, జీఎస్టీ సంస్కరణల ద్వారా దేశంలో డిమాండ్ పుంజుకుందని, ముఖ్యంగా దేశ ఎగుమతులను ప్రభావితం చేసే గ్లోబల్ సవాళ్లను ఈ పరిణామాలు పరిమితం చేశాయని నివేదిక అభిప్రాయపడింది.

వీటన్నిటినీ పరిగణలోకి తీసుకుంటే దేశ జీడీపీ 2025-26లో 6.7 శాతం వృద్ధి ఉంటుందని ఆశిస్తున్నట్లు నివేదిక పేర్కొంది. కొనసాగుతున్న అమెరికా టారిఫ్ సంబంధిత అనిశ్చితులు, సరఫరా అంతరాయం వల్ల భారత్‌కు ప్రపంచంలోని మిగిలిన ప్రాంతాలతో వాణిజ్య అవకాశాలు పెరుగుతాయి.

## జియోకు 3 నెలల్లో రూ. 2.59 లక్షల కోట్ల ఆదాయం




ముంబై, అక్టోబర్, 19 (సూర్యసేన ప్రతినిధి): దేశంలోని దిగ్గజ కంపెనీలు వరుసగా ప్రస్తుత ఆర్థిక సంవత్సరం 2025-26 రెండో త్రైమాసికంలో2 (జులై- సెప్టెంబర్) ఫలితాల్ని ప్రకటిస్తున్న సంగతి తెలిసిందే. ముందుగా ఐటీ దిగ్గజ కంపెనీలు టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్, హెచ్‌సీఎల్ టెక్నాలజీస్ తర్వాత టెక్ మహీంద్రా, విప్రో, ఇన్ఫోసిస్ ఇలా అన్నీ వరుసగా ఫలితాల్ని ప్రకటించేశాయి. ఇప్పుడు ఇతర కంపెనీల వంతు వచ్చింది. అక్టోబర్ 17న దేశంలో మార్కెట్ క్యాపిటలైజేషన్ పరంగా అతిపెద్ద కంపెనీ.. దిగ్గజ పారిశ్రామిక వేత్త ముకేశ్ అంబానీకి చెందిన రిలయన్స్ ఇండస్ట్రీస్ రెండో త్రైమాసికం ఫలితాల్ని వెల్లడించింది. ఇక్కడ మరోసారి రిలయన్స్.. మార్కెట్ అంచనాల్ని మించి రాణించడం విశేషం. సమీక్షా త్రైమాసికంలో రిలయన్స్ నికర లాభం రూ. 18,165 కోట్లుగా వచ్చింది. అంతకుముందు ఆర్థిక సంవత్సరం ఇదే సమయంలో సంస్థ నికర లాభం రూ. 16,563 కోట్లుగా ఉండగా.. ఇది 10 శాతం పెరిగింది. కంపెనీ కార్యకలాపాల ఆదాయం ఇదే సమయంలో రూ. 2.59 లక్షల కోట్లుగా వచ్చింది. కిందటేడాది ఇదే సమయంలో సంస్థ ఆదాయం రూ. 2.35 లక్షల కోట్లుగా ఉండగా.. ఇక్కడ కూడా 10 శాతం వృద్ధి నమోదు చేసింది.ప్రాఫిట్ ఆఫ్టర్ టాక్స్ విషయానికి వస్తే మాత్రం మార్కెట్ అంచనాలు తప్పడం గమనార్హం.

## హిందుస్థాన్ జింక్ లాభం రూ. 2649 కోట్లు

HINDUSTAN ZINC

ముంబై, అక్టోబర్, 19 (సూర్యసేన ప్రతినిధి): వేదాంతా గ్రూప్ సంస్థ హిందుస్థాన్ జింక్, సెప్టెంబరు త్రైమాసికానికి రూ.2649 కోట్ల ఏకీకృత నికరలాభాన్ని నమోదు చేసింది. 2024-25 ఇదే త్రైమాసిక లాభం రూ.2327 కోట్లతో పోలిస్తే, ఇది 13.8% అధికం. కమొడిటీ ధరలు అధికంగా ఉండటం, డాలర్ బలోపేతం కావడం, ఉప ఉత్పత్తులు ఎక్కువగా సాధించగలగడం ఇందుకు కారణమని సంస్థ పేర్కొంది. ఇదే సమయంలో సంస్థ ఆదాయం రూ.8522 కోట్ల నుంచి రూ.8787 కోట్లకు పెరిగింది. సెప్టెంబరు చివరకు కంపెనీ నికర రుణం రూ.2547 కోట్లుగా ఉంది. జూన్ ఆఖరులో ఇది రూ.4185 కోట్లు. వ్యర్థాలను కరిగించినప్పుడు సీసం, వెండిని రికవరీ చేసేందుకు హాట్ యాసిడ్ లీచింగ్ సాంకేతికతను దరిబా ప్లాంటులో వినియోగించబోతున్నామని, ఇది మార్చి కల్లా అందుబాటులోకి వస్తుందని కంపెనీ సీఈఓ అరుణ్ మిశ్రా తెలిపారు.







# ఇంట్రెస్టింగ్ అప్డేట్ ఇచ్చిన యామీ గౌతమ్



బాలీవుడ్ బ్యూటీ యామీ గౌతమ్ నటిస్తున్న లేటెస్ట్ మూవీ 'హక్'. 1985లో జరిగిన షాబానో కేసు ఆధారంగా తెరకెక్కుతోన్న ఈ సినిమా.. ఫుల్ కోర్టు డ్రామాగా ప్రేక్షకుల ముందుకు రాబోతున్నది.యామీ గౌతమ్, ఇమ్రాన్ హష్మీ ప్రధాన పాత్రల్లో నటిస్తున్న దీనికి.. 'రాణా నాయుడు' అండ్ 'ది ట్రయల్' ఫేమ్ డైరెక్టర్ సుపర్ణ్ వర్మ దర్శకత్వం వహిస్తున్నాడు. తాజాగా 'హక్' రిలీజ్ డేట్ ప్రకటించింది యామీ గౌతమ్. 'ఆమె తన హక్కుల కోసం పోరాడుతుంది..అతను తన నమ్మకాలను కాపాడుకుంటాడు.. ఈ నవంబర్ 7న హక్ సినిమా థియేటర్లలో విడుదలవుతోంది' అంటూ ఓ పోస్టర్ షేర్ చేసింది. ఇందులో యామీ కోర్టు రూమ్‌లో ఉండగా.. తన ఎదురుగా న్యాయమూర్తులు ఉన్నారు.

కాగా.. ఈ చిత్రం నుంచి ఇటీవల వచ్చిన టీజర్‌కు మంచి స్పందన లభించింది. ఇందులో 'నేను కేవలం ముస్లిం మహిళను కాదు.. హిందూస్థాన్‌కు చెందిన ముస్లిం మహిళను. నేను ఈ దేశానికి చెందినదానిని.. అందుకే చట్టం ఈ దేశంలోని మిగిలిన వ్యక్తులతో ఎలా వ్యవహరిస్తుందో అలాగే నన్ను కూడా చూడాలి' వంటి డైలాగ్స్ సినిమాపై క్యూరియాసిటీని పెంచాయి.

## అందర్నీ థ్రిల్ చేసే 'జటాధర'



హీరో సుధీర్ బాబు నటిస్తున్న సూపర్ నేచురల్ ఫాంటసీ థ్రిల్లర్ 'జటాధార'. నవంబర్ 7న థియేటర్లలోకి రానుంది. ఈ నేపథ్యంలో అగ్ర కథానాయకుడు మహేష్ బాబు ఈ చిత్ర ట్రైలర్‌ను లాంచ్ చేశారు. జీ స్టూడియోస్, ప్రేరణ అరోరా సంయుక్తంగా నిర్మించాయి. ట్రైలర్ లాంచ్ ఈవెంట్‌లో హీరో సుధీర్ బాబు మాట్లాడుతూ,'ట్రైలర్ లాంచ్ చేసిన మహేష్ బాబుకి థాంక్యూ. చిన్నప్పుడు విన్న 'ఓ స్త్రీ రేపు రా', 'లంకె బిందెలు' విన్నప్పుడు చాలా థ్రిల్ ఫీల్ అవుతాం. వెంకట్ వచ్చి కథ చెప్పినప్పుడు అంతేగా థ్రిల్ అనిపించింది. ఆడియన్స్ కూడా థియేటర్స్‌లో అదే థ్రిల్ ఫీల్ అవుతారు. ఈ సినిమాలో అద్భుతమైన కథ ఉంది. చాలా మంచి ఎమోషన్స్ ఉంటాయి. తప్పకుండా చాలా ఎంజాయ్ చేస్తారు. సోనాక్షి చేసిన పెర్ఫార్మెన్స్ ఇంకెవరు కూడా మ్యాచ్ చేయలేరు. ధన పిశాచి పవర్ ఫుల్‌రోల్. శిల్పా క్యారెక్టర్ ఇందులో చూస్తే భయమేస్తుంది. సినిమా ఒక దమ్ బిర్యానిలా తయారైంది' అని తెలిపారు. 'ఇది నా ఫస్ట్ తెలుగు సినిమా.

చాలా స్పెషల్. ధన పిశాచి లాంటి రోల్ ఇప్పటివరకూ చేయలేదు. ఒక యాక్టర్‌గా ఇలాంటి క్యారెక్టర్ చేయడం చాలా ఆనందాన్ని ఇచ్చింది' అని హీరోయిన్ సోనాక్షి సిన్హా చెప్పారు. శిల్పా శిరోద్కర్ మాట్లాడుతూ,"బ్రహ్మ' వచ్చిన చాలా ఏళ్ల తర్వాత మళ్లీ ఈ సినిమాతో తెలుగులోకి రావడం చాలా హ్యాపీగా ఉంది. ఈ సినిమా చాలా అద్భుతంగా వచ్చింది' అని తెలిపారు. 'తెలుగు ఇండస్ట్రీ మాకు చాలా స్పెషల్.

ఈ సినిమా పెద్ద సక్సెస్ అవుతుందని కాన్ఫిడెంట్‌గా ఉన్నాం' అని నిర్మాత ఉమేష్ చెప్పారు. నిర్మాత ప్రేరణ అరోరా మాట్లాడుతూ,'మాకు సపోర్ట్ చేసిన జీ స్టూడియోస్‌కి కృతజ్ఞతలు. సుధీర్ బాబుకి నేను పెద్ద ఫ్యాన్‌ని. ఆయన వల్లే ఈ సినిమా తెలుగులో చేయగలిగాం' అని అన్నారు. మరో నిర్మాత శివిన్ నారంగ్ మాట్లాడుతూ,'ఇది బ్లాక్ బస్టర్ స్క్రిప్ట్. తప్పకుండా సినిమా మీ అందరికీ నచ్చుతుంది' అని తెలిపారు.

## నాలుగు సినిమాలతో రవితేజ బిజీ



కథానాయకుడు రవితేజ వరుస సినిమాలతో బిజీగా ఉన్నారు. ఆయన నటించిన 'మాస్ జాతర' ఈ నెల 31న విడుదల కానుంది. ఆయనకు ఇది 75వ చిత్రం. ఇవే కాకుండా మరో మూడు సినిమాలు షూటింగ్‌లో ఉన్నాయి. 'ధమాకా' తర్వాత మరోసారి శ్రీలీలతో జోడీ కట్టిన రవితేజ, ఈసారి కూడా ప్రేక్షకులను ఎంటర్‌టైన్ చేయడానికి 'మాస్‌జాతర'తో ముందుకు వస్తున్నారు. భాను భోగవరపు దర్శకత్వంలో రూపొందిన ఈ సినిమాను నాగవంశీ, సాయి సౌజన్య సంయుక్తంగా నిర్మించారు. కిశోర్ తిరుమల దర్శకత్వంలో రవితేజ నటిస్తున్న 76వ సినిమా 'భర్త మహాశయులకు విజ్ఞప్తి'. ఇందులో ఆషికా రంగనాథ్, కేతిక శర్మ కథానాయికలు. స్పెయిన్‌లో షఉటింగ్ జరుగుతోంది. సుధాకర్ చెరుకూరి నిర్మిస్తున్న ఈ సినిమా సంక్రాంతి 2026లో విడుదల కానుంది. 77వ ప్రాజెక్ట్ కోసం రవితేజ 'నిన్ను కోరి', 'మజిలీ', 'ఖుషీ' దర్శకుడు శివ నిర్వాణతో జట్టుకట్టనున్నారు. మైత్రీ మూవీ మేకర్స్ నిర్మిస్తున్నారు. కళ్యాణ్ శంకర్ దర్శకత్వంలో మరో సినిమాలో ఆయన నటించనున్నారు. సూర్యదేవర నాగవంశీ ఈ చిత్రాన్ని భారీ బడ్జెట్‌తో నిర్మించనున్నారు.

## మరో సినిమా ఆఫర్ రిజెక్ట్ చేసిన కృతి శెట్టి..



ఇండస్ట్రీకి ఎంట్రీ ఇచ్చిన అనతికాలంలోనే ఫుల్ క్రేజ్ తెచ్చుకుంది కృతి శెట్టి. డెబ్యూ మూవీ ఉప్పెనతోనే బ్లాక్ బస్టర్ హిట్ అందుకున్న ఈ ముద్దుగుమ్మ. రీసెంట్‌గా కోలీవుడ్ ఎంట్రీ కూడా ఇచ్చేసింది. ఇక రీసెంట్‌గా బాలీవుడ్‌లో కూడా ఓ ఆఫర్ రావడంతో.. అక్కడ ఎంట్రీకి రంగం సిద్ధం చేసుకుంది.

బాలీవుడ్ సీనియర్ నటుడు గోవింద కుమారుడు యశ్వర్ధన్ అహూజా డెబ్యూ మూవీతోనే కృతి బాలీవుడ్ ఎంట్రీ ఇవ్వనుందని, దీనికి సాజిద్ ఖాన్ దర్శకత్వం చేస్తారంటూ వార్తలు వినిపించాయి. ప్రముఖ బాలీవుడ్ నిర్మాణ సంస్థ జీ స్టూడియోస్ ఈ సినిమాను నిర్మిస్తుండగా.. ప్రస్తుతం స్క్రిప్ట్ పనులు జరుగుతున్నాయని, త్వరలోనే అఫీషియల్ అనౌన్స్‌మెంట్ రానుందని టాక్ వచ్చింది. అయితే ఏమైందో ఏమో కానీ.. యశ్వర్ధన్ అహూజా సరసన నటించాల్సిన మూవీ నుంచి హీరోయిన్‌గా కృతి శెట్టి తప్పుకున్నట్లు తెలుస్తోంది. నిజానికి, గతంలో కూడా కృతి 'బేబీ' హిందీ రీమేక్‌లో హీరోయిన్‌గా దాదాపు ఖరారైంది, కానీ కొన్ని కారణాల వల్ల ఆ ప్రాజెక్టు ఆగిపోయింది. ఇప్పుడు మరోసారి ఆమె బాలీవుడ్ మూవీ నుంచి తప్పుకోవడంతో.. కృతికి బాలీవుడ్ సెట్ కాదు కామెంట్స్ చేస్తున్నారు నెటిజన్లు.


## అంత పెద్ద స్టేట్మెంట్ వద్దు బాస్



తమ సినిమాల ప్రమోషన్లలో భాగంగా మైక్ అందుకున్నపుడు ఆర్టిస్టులు, టెక్నీషియన్లు చాలా ఎగ్జైట్ అయిపోతుంటారు. ప్రేక్షకుల్లో హైప్ పెంచేందుకు, వాళ్లను థియేటర్లకు రప్పించేందుకు తమ సినిమాల గురించి కొంచెం ఎక్కువ చేసి మాట్లాడుతుంటారు. ఈ క్రమంలో పెద్ద పెద్ద స్టేట్మెంట్స్ కూడా ఇచ్చేస్తుంటారు. కానీ వాళ్లిచ్చిన హైప్‌కు తగ్గట్లు సినిమా ఉంటే.. ఓకే. కానీ తేడా కొడితే మాత్రం ఆ స్టేట్మెంట్లు బూమరాంగ్ అవుతుంటాయి. వాళ్ల ఇమేజ్‌ను, క్రెడిబిలిటీని బాగా డ్యామేజ్ చేస్తుంటాయి.

ట్రోల్స్‌కు కూడా దారి తీస్తుంటాయి. గతంలో విశ్వక్సేన్ 'పాగల్' అనే సినిమా గురించి మాట్లాడుతూ.. కరోనా కారణంగా మూతపడ్డ థియేటర్లను కూడా ఈ సినిమా తెరిపిస్తుందని స్టేట్మెంట్ ఇచ్చాడు. కానీ ఆ సినిమాకు జనం లేక తొలి వారంలోనే షోలు క్యాన్సిల్ చేయాల్సిన పరిస్థితి వచ్చింది.ఇక ఈ ఏడాది ఆరంభంలో నేచురల్ స్టార్ నాని 'కోర్టు' మూవీ గురించి ఒక పెద్ద స్టేట్మెంట్ ఇచ్చాడు. ఈ సినిమా నచ్చకపోతే తాను హీరోగా నటించే తర్వాతి సినిమాను చూడొద్దని అన్నాడు. ఐతే నాని ఊరికే మాట వదిలే రకం కాదు. 'కోర్టు' మీద పూర్తి ధీమాతోనే ఆ స్టేట్మెంట్ ఇచ్చాడు. జనాలకు ఆ సినిమా నచ్చింది. కాబట్టి 'హిట్-3'కి ఇబ్బంది లేకపోయింది. కానీ 'కోర్టు'లో లీడ్ రోల్ చేసిన ప్రియదర్శి.. నానిని అనుకరిస్తూ 'మిత్రమండలి' సినిమా విషయంలో ఇలాంటి ఛాలెంజే విసిరాడు. 'మిత్రమండలి' నచ్చకపోతే తన తర్వాతి సినిమా చూడొద్దు అనేశాడు. తీరా చూస్తే.. 'మిత్రమండలి'కి చాలా బ్యాడ్ టాక్ వచ్చింది.

## 'మీర్జాపూర్' సిరీస్ లో ప్రముఖ నటి...



ప్రముఖ క్రైమ్ థ్రిల్లర్ సిరీస్ మిర్జాపూర్ సీజన్ 4 అభిమానులు ఎదురుచూస్తున్నారు. మేకర్స్ కొన్ని రోజుల క్రితం కొత్త సీజన్ షూటింగ్‌ను అధికారికంగా ప్రారంభించారు. ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్న సీజన్ జనవరి 2026లో ప్రదర్శించబడుతుంది. దాని తీవ్రమైన కథాంశం, శక్తివంతమైన సంభాషణలు మరియు కల్ట్ ఫాలోయింగ్‌ను నిర్మించిన క్రైమ్ డ్రామా మరింత మలుపులు మరియు రక్తపాతాలతో తిరిగి రావడానికి సిద్ధంగా ఉంది. తాజాగా ఇప్పుడు లేటెస్ట్ రిపోర్ట్స్ ప్రకార, ఈ సిరీస్ లో ప్రముఖ నటి సోనాల్ చౌహన్ కీలక పాత్రలో నటిస్తున్నట్లు ఫిలిం సర్కిల్ లో వార్తలు వినిపిస్తున్నాయి. గుర్మీత్ సింగ్ దర్శకుడిగా మరియు పునీత్ కృష్ణ రచయితగా ఉన్న సిరీస్ అమెజాన్ ప్రైమ్ వీడియోలో ప్రసారం కానుంది. రితేష్ సిధ్వానీ మరియు ఫర్హాన్ అక్తర్, సహ నిర్మాతలు కాసిమ్ జగ్మాగియా మరియు విశాల్ రాంచందనీలతో కలిసి నిర్మిస్తున్న ఈ చిత్రంలో పంకజ్ త్రిపాఠి, అలీ ఫజల్, దివ్యేందు మరియు అభిషేక్ బెనర్జీ కీలక పాత్రల్లో కనిపించనున్నారు.

## ఫంకీ రిలీజ్ డేట్ ఫిక్స్....



ఈ ఏడాది 'లైలా' చిత్రంతో ప్రేక్షకుల ముందుకు వచ్చిన మాస్ కా దాస్ విశ్వక్ సేన్.. ఇప్పుడు 'ఫంకీ' మూవీతో బిజీగా ఉన్నాడు. ఈ మూవీకి కామెడీ ఎంటర్‌టైనింగ్ చిత్రాలకు కేరాఫ్‌గా నిలిచిన అనుదీప్ దర్శకత్వం వహిస్తున్నాడు. సితార ఎంటర్‌టైన్మెంట్స్ బ్యానర్‌పై నాగవంశీ, సాయి సౌజన్య నిర్మిస్తుండగా.. భీమ్స్ సిసిరోలియో సంగీతం అందిస్తున్నాడు. షూటింగ్ శరవేగంగా జరుపుకుంటున్న ఈ సినిమాకు సంబంధించిన ఇటీవల టీజర్ విడుదల కాగా.. సోషల్ మీడియాలో మంచి రెస్పాన్స్ దక్కించుకుంది. దీంతో ఈ సినిమా ఎప్పుడెప్పుడు రిలీజ్ అవుతుందా అని ఫ్యాన్స్‌తో పాటు ప్రేక్షకులు కూడా ఈగర్‌గా వెయిట్ చేస్తున్నారు. అంతే కాకుండా.. ఈ సినిమాతో విశ్వక్ మంచి కమ్‌బ్యాక్ ఇస్తాడంటూ గట్టిగా హోప్స్ పెట్టుకున్నారు ఫ్యాన్స్.

E-PAPER
visit us @ http://e-paper.sooryasena.com

www.sooryasena.com

EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY **PALVAI JANAIAH,** PRINTED AT **R K ART PRINTERS,** H.NO. 1-9-277/23/B, VIDYANAGAR, NALLAKUNTA, HYDERABAD-500044, TELANGANA STATE, PUBLISHED AT H.NO. 2-1-115/3/16/1, MAMILLAGADDA, SURYAPET-508213,NALGONDA DISTRICT, TELANGANA STATE. **EDITOR : PALVAI JANAIAH,**
**RNI. No: TELTEL/2023/85598,** CELL: 9951241048, EMAIL : srptsurya@gmail.com